**విలేకరులు కావలెను**

కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం : 9700370499

సీనియర్ జర్నలిస్ట్, ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



# విజయ సారథి

RNI / APTEL/2015/64956

తెలుగు దినపత్రిక



**టీవీ రిపోర్టర్లు కావలెను**

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం : 9700370499

యండి. పి.వెంకటేశ్వర్లు



చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | బుధవారం 18-06-2025 | సంపుటి : 11 | సంచిక : 142 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


## జాతీయ స్థాయికి మించి పెరిగిన ఏపీ తలసరి ఆదాయం




అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు (ంఖ అఓ ఔజీతీజీ అష్ట్రజీనిటతీజీఎజీఏబీ ఔజీతిటబీ) ఇవాళ(మంగళవారం) ప్రణాళిక శాఖపై రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీ సీఎస్ విజయానంద్, సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఏపీ ఎకానమీ, గ్రోత్ డ్రైవర్స్, జీఎస్డీపీ ప్రొజెక్షన్స్, కీ పెర్ఫామెన్స్ ఇండికేటర్లపై సమీక్షించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జాతీయ స్థాయికి మించి ఏపీ తలసరి ఆదాయం పెరిగిందని అధికారులు వెల్లడించారు. 2024-25కు జాతీయ స్థాయిలో సరాసరి తలసరి ఆదాయం 8.7 శాతంగా ఉంటే.. ఏపీ ఆదాయం 11.89 శాతం నమోదు చేసిందని అధికారులు సీఎం చంద్రబాబుకి వివరించారు.

తలసరి ఆదాయం, జీఎస్డీపీ, రాష్ట్ర ఆదాయాలు ఎలా పెరుగుతాయనే అంశంపై అధికారులు అంచనాలు రూపొందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రం స్వయం సమృద్ధి సాధించాలంటే ఏం చేయాలనే అంశంపై డేటా అనలిటిక్స్ చేయాలని సూచించారు. సేవల రంగం అభివృద్ధి జరిగేలా దృష్టి పెడితే ఆర్థిక సుస్థిరతను సాధించగలమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గ్రామస్థాయిలో కూడా కీ-పెర్ఫామెన్స్ ఇండికేటర్లు పెడితే.. క్షేత్రస్థాయిలో పోటీతత్వం పెరుగుతోందని సీఎం చంద్రబాబు చెప్పారు. 15 శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు చేయడంతో పాటు.. పనితీరును మెరుగుపరుచుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

### స్వర్ణ ఆంధ్ర విజన్ చర్చ

స్వర్ణ ఆంధ్ర విజన్ ఏ2047ని పకడ్బందీగా అమలు చేయడం కోసం సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ అమలు కోసం యంగ్ ప్రొఫెషనల్స్‌ను నియమించాలని సీఎం నిర్ణయించారు. 48 నెలల పాటు పనిచేయడానికి ప్రతి నియోజకవర్గానికి ఒక్కొక్కరి చొప్పున యంగ్ ప్రొఫెషనల్స్‌ని నియమించాలని అధికారులకు సూచించారు. ఏపీవ్యాప్తంగా 175 మంది యంగ్ ప్రొఫెషనల్స్ నియామకానికి అనుమతిస్తూ సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారు.

### ఏపీలో ఇకపై ప్లాస్టిక్ రహిత నగరాలు: సీఎం చంద్రబాబు

అలాగే.. సర్క్యులర్ ఎకనామి సమీక్షలో సీఎం చంద్రబాబు అధికారులతో చర్చించారు. ఏపీలో ఇకపై ప్లాస్టిక్ రహిత నగరాలు ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాది అక్టోబర్ 2వ తేదీ లోగా ఏపీలోని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండ్రి, 4 ప్రధాన నగరాలతో పాటు మరో 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని పూర్తిగా అరికట్టాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ నగరాల్లో క్లాత్ బ్యాగ్స్ వినియోగం పెంచాలని సూచించారు. అలాగే 87 పట్టణ ప్రాంతాల్లో 157 రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

## యోగా ప్రపంచ ఐక్యతా స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది: ప్రధాని మోదీ



యోగా అనేది కేవలం వ్యక్తిగత ఆరోగ్యం గురించి మాత్రమే కాకుండా, మానవత్వం, పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ ఐక్యతా స్ఫూర్తిని నెలకొల్పడానికి కూడా తోడ్పడుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ మేరకు యోగా దినోత్సవ సందేశంతో కూడిన లేఖను ప్రధాని విడుదల చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు యోగా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.'చారిత్రాత్మక యోగా ప్రస్థానం విజయవంతంగా 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాని ని మరింత వైభవంగా నిర్వహించుకోబోతున్నాం. గత పదేళ్లుగా యోగా కేవలం భారతదేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ చేరువై వారి జీవితాల్లో సానుకూల ప్రభావం చూపుతోంది. అది మనందరికీ గర్వకారణం. ఈ ఏడాది విశాఖపట్నం కేంద్రంగా జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా.. ఒక భూమి.. ఒక ఆరోగ్యం..' అనే థీమ్‌తో జరుపుకోబోతున్నాం' అని ప్రధాని పేర్కొన్నారు.'యోగా మన సంస్కృతిలో ఒక అంతర్భాగం. ఇది శరీరం, మనసు మధ్య సమతుల్యతను సాధించడంలో సహాయపడుతుంది. శారీరకంగా, మానసికంగా స్వావలంబన పొందిన పౌరులు దేశ నిర్మాణంలో మరింత కీలక పాత్ర పోషించగలరు. దేశవ్యాప్తంగా ప్రతి పంచాయతీ పరిధిలో జూన్ 21న జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో వీలనంత ఎక్కువ మందిని భాగస్వామ్యం చేయాల'ని ప్రధాని మోదీ అకాంక్షించారు.

## అమరావతి నిర్మాణంలో కీలక అడుగు



అమరావతి,జూన్ 17 ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంలో కీలక అడుగు పడింది. 2018 నుంచి పెండింగులో ఉన్న రెండు ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపింది. రూ.2,787 కోట్లతో నిర్మించే ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అందులో రూ.1,329 కోట్లతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు క్వార్టర్స్ నిర్మాణం, రూ. 1,458 కోట్లతో కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులను సీపీడబ్ల్యూడీ నిర్మిస్తుందని కేంద్ర ఆర్థికశాఖ కార్యాలయం మెమోరాండం విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఎక్స్ వేదికగా వివరాలను వెల్లడించారు.

## బనకచర్ల ప్రాజెక్ట్‌పై ఈఏసీ కీలక భేటీ

న్యూఢిల్లీ, జూన్ 17: బనకచర్ల ప్రాజెక్ట్‌పై కేంద్ర పర్యావరణ నిపుణుల అంచనాల కమిటీ (ఈఏసీ) ఈరోజు (మంగళవారం) భేటీ అయ్యింది. పోలవరం - బనకచర్ల ప్రాజెక్ట్ పర్యావరణ అనుమతులపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ప్రొఫెసర్ చక్రపాణి నేతృత్వంలో ఈ కమిటీ ఏర్పాటు అయ్యింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ కార్యాలయం నుంచి వర్చువల్‌గా ఈ కమిటీ సమావేశమైంది. ఇందులో భాగంగా ఏపీ ప్రభుత్వ (ంఖ ఉ నీలబి) ప్రతిపాదనలను ఈ కమిటీ పరిశీలించనుంది. బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల కలిగే పర్యావరణ ప్రభావాన్ని కమిటీ అంచనా వేయనుంది.పోలవరం - బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు అనుమతి ఇవ్వాలంటూ ప్రధాని మోదీతో పాటు కేంద్రమంత్రులు అమిత్ షా, సీఆర్ పాటిల్‌కు అనేక సార్లు వినతి చేశారు కూడా. ఈ క్రమంలో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి తొలి అడుగుపడింది. బనకచర్ల ప్రాజెక్ట్‌పై ఈఏసీ కీలక సమావేశం ప్రారంభమైంది. ప్రాజెక్ట్ చేపట్టడం వల్ల జరిగే పర్యావరణ ప్రభావం ఏ విధంగా ఉంటుంది అన్నదానిపై కమిటీ అంచనా వేయనుంది. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగానే తదుపరి అనుమతులు వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఈ సమావేశాన్ని ఏపీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది.అయితే బనకచర్ల ప్రాజెక్ట్‌ను పూర్తిగా అనుమతింకూడదని, రిజెక్ట్ చేయాలంటూ తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి . ఈఏసీకి లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వం అనుమతి లేకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఈ ప్రాజెక్టును చేపడుతున్నారని తెలిపారు. గోదావరి నీటిని కృష్ణలో కలిపేందుకు ప్రయత్నం చేస్తున్నారని, దీని వల్ల తెలంగాణ హక్కులను హరించినట్లు అవుతుందని... ఈ ప్రాజెక్ట్‌కు ఏమాత్రం అనుమతులు ఇవ్వొద్దని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు. ఈ క్రమంలో నేటి




సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాలను ఈఏసీ ఏ విధంగా పరిగణలోకి తీసుకుంటుంది, ఈ ప్రాజెక్ట్‌కు పర్యావరణ ప్రభావం ఏ విధంగా ఉండబోతుంది అనే దానిపై కేంద్రానికి కమిటీ నివేదిక ఇచ్చే అవకాశం ఉంది. పోలవరం - బనకచర్ల ప్రాజెక్టులతో పాటు ఉత్తరప్రదేశ్‌లోని పంప్‌డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌లపైనా ఈ కమిటీ సమావేశం జరుగుతోంది.

## బనకచర్ల ప్రాజెక్టుపై వాస్తవాలు ప్రజలకు తెలియాలి..

బనకచర్ల ప్రాజెక్టుపై వాస్తవాలు ప్రజలకు తెలియాలని, దీనిపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, గత 50 ఏళ్లుగా గోదావరి నీరు వృథాగా 3000 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోందని, ఇందులో 200 టీఎంసీల నీరు ఉపయోగించి బనకచర్లకు తరలించాలనే ఈ ప్రాజెక్ట్ నిర్మాణ ఉద్దేశమని ఏపీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ( అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడారు. మూడు సెగ్మెంట్‌లుగా బనకచర్ల నిర్మాణం జరుగుతుందని, పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు.. ప్రకాశం బ్యారేజీ నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్ వరకు.. సెగ్మెంట్ 2: బొల్లాపల్లి నుంచి బనకచర్ల వరకు.. సెగ్మెంట్ 3.. ఇలా మూడు సెగ్మెంట్‌లలో నిర్మాణం జరుగుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

**ఆరోపణలు కేవలం రాజకీయాల కోసమే**..బనకచర్లపై వస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయాల కోసమేనని, సాంకేతిక అంశాల కన్నా రాజకీయంపై దృష్టితోనే ఆరోపణలు చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. తెలంగాణలో అంతర్గత రాజకీయలు కోసం బనకచర్లపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి అనుమతి లేకుండా ఏపీ ప్రభుత్వం ముందుకు వెళుతోందని అసత్యాలు చెబుతున్నారని మండిపడ్డారు. అన్ని నియమ నిబంధనల ప్రకారమే అనుమతి తీసుకుని నిర్మాణం జరుగుతుందన్నారు. సీడబ్ల్యూసీకి ఇప్పటికే ప్రాథమిక నివేదిక ఇచ్చామని చెప్పారు. ఆమోదం లేకుండా డీపీఆర్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారని, ప్రాథమిక నివేదిక ఆమోదం తెలిపాక డీపీఆర్ ఇస్తామని మంత్రి తెలిపారు. పోలవరం, బనకచర్ల అనుమతులు నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయని మరోసారి స్పష్టం చేశారు.

**ఏ రాష్ట్రానికి ఎలాంటి నష్టం లేదు**..ఏపీ జలదోపిడీ అని విమర్శలు చేస్తున్నారని, వరద జలాలు ఉపయోగించుకోవడం తమ హక్కు అని, దిగువ రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్ ఎగువ రాష్ట్రాల ప్రయోజనాలు... నీటి అవసరాలు తీరాక మాత్రమే వరద జలాలు ఉపయోగిస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఏ రాష్ట్రానికి ఎలాంటి నష్టం లేదని, ప్రతి ఏడాది 3వేల టీఎంసీల నీరు సముద్రంలోకి పోతోందన్నారు. ఒక ఏడాది 7 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోయిందన్నారు. ఇంకా వర్షాకాలం పూర్తిగా రాకుండానే సముద్రంలోకి నీరు వృథాగా పోతోందని అన్నారు. కేసీఆర్ చేపట్టిన ప్రాజెక్టులకు సరైన అనుమతి తీసుకోలేదని ఆరోపించారు. పూర్తయిన ప్రాజెక్టులకే అనుమతి లేదని, ఇంకా ప్రారంభ దశలో ఉన్న ప్రాజెక్టుల అనుమతిపై మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రాజెక్టును ఆపాలన్న దురుద్దేశం తమకు లేదని... సీఎం చంద్రబాబుకు అసలే లేదని




మంత్రి నిమ్మల స్పష్టం చేశారు. సీతారాం సాగర్ లిఫ్ట్‌కు కూడా మొన్ననే అనుమతి వచ్చిందని, కానీ 75 శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు.

**చాలా ప్రాజెక్టులకు చంద్రబాబు సహకరించారు**..దేవాదుల ఎత్తి పోతల పథకంతో పాటు చాలా ప్రాజెక్టులకు చంద్రబాబు సహకరించారని, బీమా ఎత్తిపోతల పథకానికి కూడా సహకారం అందించారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎస్సార్ఎస్పీతో పాటు అనేక ప్రాజెక్టులకు చంద్రబాబు సహకరించారన్నారు. ఈ విషయాన్ని తెలంగాణా ప్రజలు గుర్తు పెట్టుకోవాలన్నారు. దిగువ రాష్ట్రాలకు ఉన్న హక్కుల ప్రకారం చంద్రబాబు కొన్ని ప్రాజెక్టుల విషయంలో అభిప్రాయం చెప్పారు తప్ప అడ్డుకోవాలని కాదని అన్నారు. అపెక్స్‌లో ఇరు రాష్ట్రాల సీఎంల మాటలు మినిట్స్ రూపంలో ఉన్నాయన్నారు. రెండు రాష్ట్రాలు ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉండాలని చంద్రబాబు చెప్పారని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు.

## వెంటనే టెహ్రాన్ నుంచి వచ్చేయండి..

### భారతీయులకు హెచ్చరిక

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య వైమానిక దాడులతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇరుదేశాలు పరస్పరం క్షిపణులతో భీకర దాడులకు దిగడంతో పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగింది. ఇరుదేశాల మధ్య దాడుల నేపథ్యంలో పశ్చిమాసియాలో అన్ని ఎయిర్ పోర్టులు మూసివేశారు. మరోవైపు, జీ-7 సమావేశం నుంచి డోనాల్డ్ ట్రంప్ అర్ధాంతరంగా అమెరికా వెళ్లిపోయారు. దీంతో ఇరాన్ లో ఏక్షణమైనా ఏదైనా జరగొచ్చని ప్రచారం జరుగుతోంది. ఇజ్రాయెల్ దాడులను అడ్డుకునేందుకు ఇరాన్ గగనతలంపై ఆంక్షలు విధించింది. దీంతో విమానాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్ ను వదిలి స్వదేశానికి రావాలని భారతీయులకు ఇండియన్ ఎంబసీ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో టెహ్రాన్ నుంచి అఫ్ఘనిస్తాన్ మీదుగా భారతీయులు.. ఇండియాకు చేరుకుంటున్నారు. కాగా, ఈ దాడుల్లో ఇరుదేశాల్లో దాదాపు 300కు పైగా మంది మృతి చెందగా.. వందల మంది గాయాలపాలయ్యారు.



# సంపాదకీయం

బుధవారం 18-06-2025

## టర్కీ కాస్కో.....మోడీ దెబ్బ

భారత ప్రధాని నరేంద్ర మోదీ కేవలం 10 లక్షలోపు జనాభా ఉన్న చిన్న ద్వీప దేశమైన సైప్రస్‌లో పర్యటిస్తున్నారు. తద్వారా టర్కీకి గట్టి సందేశం పంపించారు. టర్కీ, సైప్రస్ మధ్య దశాబ్దాలుగా వైరం ఉండగా.. సైప్రస్‌కు అండగా నిలవడం వ్యూహాత్మకంగా, ఆర్థికంగా భారత్‌కు ప్రయోజనకరం. మధ్యధరా సముద్రంలో మన ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి.. యూరోపియన్ యూనియన్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి సైప్రస్‌తో స్నేహం ఉపయోగపడుతుంది. ఇది భారతదేశానికి ఒక ముఖ్యమైన భాగస్వామిగా మారుతుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ సైప్రస్ అనే ఓ చిన్న దేశంలో పర్యటిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను మోదీ ఎక్స్ ద్వారా ప్రజలతో పంచుకున్నారు. మధ్యదరా సముద్రంలో చిన్న ద్వీప దేశమైన సైప్రస్ గురించి మనలో చాలా మందికి తెలియదు. ఆ మాటకొస్తే మన దేశాధినేతలు కూడా సైప్రస్‌కు అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదు. కానీ ప్రపంచ శక్తిగా ఎదిగే క్రమంలో భారత్.. తనతో కలిసి వచ్చే ప్రతి దేశాన్నీ కలుపుకొని పోతోంది. అయితే సైప్రస్‌తో దోస్తీ మాత్రం అంతకు మించిన కొత్త సమీకరణలకు తెరతీయనుంది. ఎందుకంటే తుర్కియే గుర్తుంది కదా, అదేనండీ టర్కీ. గతంలో టర్కీని భారీ భూకంపం వణికించినప్పుడు 'ఆపరేషన్ దోస్త్'తో భారత్ అండగా నిలిచింది. కానీ ఆపరేషన్ సింధూర్ సమయంలో టర్కీ పాకిస్థాన్‌కు మద్దతు ప్రకటించడంతోపాటు.. మనపై దాడులకు డ్రోన్లను సైతం ఇస్లామాబాద్‌కు అందించింది. ఇప్పుడు టర్కీకి ఓ బలమైన సందేశం ఇవ్వడం కోసం ప్రధాని మోదీ సైప్రస్‌లో పర్యటిస్తున్నారు. సైప్రస్ పర్యటనకు వెళ్తే.. టర్కీకి మెసేజ్ ఎలా ఇస్తారని అనుకుంటున్నారా..? అక్కడికే వస్తున్నాం.. టర్కీ, సైప్రస్ రెండింటి మధ్య వైరం ఉంది. 1974లో సైప్రస్ మీద దాడి చేసిన టర్కీ.. ఆ దేశంలో మూడో వంతు భూభాగాన్ని ఆక్రమించుకుంది. అదిగో అప్పటి నుంచి టర్కీ అంటే సైప్రస్‌కు ఏమాత్రం గిట్టదు. అలాంటి సైప్రస్‌కు ప్రధాని మోదీ వెళ్లడం, అది కూడా ఆపరేషన్ సింధూర్ తర్వాత చేపట్టిన తొలి విదేశీ పర్యటన ఇదే కావడం అంటే.. నా శత్రువుతో నువ్వు చెలిమి చేస్తే.. నీ శత్రువుతో నేను దోస్తీ చేస్తానని టర్కీకి బలంగా సంకేతాలు ఇచ్చినట్టే కదా. టర్కీ గనుక తన జోలికొస్తే.. భారత్ తనకు అండగా ఉంటుందనే భరోసా సైప్రస్‌కు దక్కినట్టే. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా, అత్యంత శక్తివంతమైన సైనిక శక్తుల్లో ఒకటిగా ఎదుగుతోన్న భారత్‌తో స్నేహం అనేది సైప్రస్‌కు కొండంత అండ అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. భారత్‌తో మరింత సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే ఉద్దేశంతో ఉన్న సైప్రస్.. ప్రధాని మోదీని తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'ది గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకరియోస్ ఎఎ'తో సత్కరించి గౌరవించింది. సైప్రస్‌కు మన మద్దతు దొరుకుతుంది. టర్కీ మీద కోపంతో ఆ దేశానికి మద్దతు ఇవ్వడం వల్ల మనకు వచ్చే లాభం ఏంటి అనుకుంటున్నారా? వ్యూహాత్మకంగా, దౌత్యపరంగా, భౌగోళిక రాజకీయ పరంగానే కాకుండా ఆర్థికంగానూ సైప్రస్‌తో దోస్తీ భారత్‌కు ప్రయోజనకరం కానుంది. టర్కీ, సిరియాలకు దగ్గరగా ఉండే సైప్రస్ భౌగోళికంగా ఆసియాలో ఉన్నట్టుగా ఉంటుంది. కానీ ఆ దేశానికి యూరోపియన్ యూనియన్ (ఈయూ)లో సభ్యత్వం ఉంది. పశ్చిమ దేశాలతో దానికి మంచి సంబంధాలే ఉన్నాయి. అంతే కాదు 2026లో ఈయూ అధ్యక్ష పదవిని చేపట్టనుంది. అంటే యూరోపియన్ దేశాలతో మన సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి, మన ప్రయోజనాలను కాపాడుకోవడానికి సైప్రస్ ఉపయోగపడనుంది. ఈయూతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి కూడా ఈ ద్వీప దేశం మనకు ఉపయోగపడుతుంది. పాకిస్థాన్ సరిహద్దు ఉగ్రవాదం, కశ్మీర్ అంశంతోపాటు.. ఐక్యరాజ్య సమితిలోని భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాలనే డిమాండ్ విషయంలో సైప్రస్ ఇండియాకు మద్దతునిస్తోంది. ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడిని సైతం సైప్రస్ ఖండించింది. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఈయూలో లేవనెత్తుతామని ప్రకటించింది. సైప్రస్‌తో స్నేహం చేయడం వల్ల మధ్యదరా సముద్రంలోని కీలక ప్రాంతంలో మన ప్రాబల్యాన్ని పెంచుకోవచ్చు. సైప్రస్‌లో ఆర్థిక సేవల రంగం చాలా అభివృద్ధి చెందింది. పన్ను విధానాలు అనుకూలంగా ఉంటాయి. షిప్పింగ్ పరిశ్రమ కూడా అభివృద్ధి చెందింది. దీంతో భారత కంపెనీలు యూరప్ మార్కెట్‌లోకి ప్రవేశించడానికి ఇది అనువైన చోటు అని చెప్పొచ్చు. భారతదేశ వ్యాపారాలకు ఈయూలో గేట్ వేగా సైప్రస్ మారుతుంది. సైప్రస్‌లోని అతిపెద్ద బ్యాంకులలో ఒకటైన యూరో బ్యాంక్, ముంబైలో ఆఫీసును ప్రారంభిస్తామని ప్రకటించింది. భారతదేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెట్టే విషయంలో సైప్రస్ కీలక పాత్ర పోషించనుంది. రెండు దేశాల మధ్య డబుల్ టాక్సేషన్ అవాయిడెన్స్ అగ్రిమెంట్ ఉంది. తూర్పు మధ్యధరా ప్రాంతంలోని నిక్షేపాల నుంచి సహజ వాయువును వెలికి తీయడంలో సైప్రస్ ముఖ్య పాత్ర పోషిస్తోంది. టర్కీ తవ్వకాల కారణంగా ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. భవిష్యత్తులో భారత్, సైప్రస్ మధ్య ఎనర్జీ సెక్టార్‌లో భాగస్వామ్యానికి అవకాశం ఉంది. మన సహజవాయువు అవసరాలను తీర్చడానికి సైప్రస్ ఉపయోగపడే అవకాశం ఉంది. భారత్– పశ్చిమాసియా– యూరప్ ఎకానమిక్ కారిడార్‌లో సైప్రస్ కీలకమైన భాగం అయ్యే అవకాశం ఉంది. టర్కీ విస్తరణ వాదాన్ని అడ్డుకోవడానికి భారత్ సైప్రస్‌కు ఉపయోగపడితే.. సైప్రస్ ద్వారా మధ్యదరా సముద్ర ప్రాంతంలో భారత్ ప్రాబల్యం పెరుగుతుంది. సైప్రస్‌లోని కొంత భూభాగాన్ని టర్కీ ఆక్రమించిన తర్వాత.. ఉద్రిక్తతలను నివారించడానికి ఐక్యరాజ్య సమితి 'గ్రీన్ లైన్' పేరిట బఫర్ జోన్‌ను ఏర్పాటు చేసింది.

# కార్గిల్ తరహా దాడులకు వ్యూహం

శ్రీనగర్, జూన్ 17, 1999లో జరిగిన కార్గిల్ యుద్ధం భారత్?పాకిస్తాన్ సంబంధాలలో ఒక కీలక ఘట్టం. పాకిస్తాన్ సైన్యం జమ్మూ కాశ్మీర్‌లోని కార్గిల్ ప్రాంతంలోని నియంత్రణ రేఖ (ఒనీఅ) వెంబడి రహస్యంగా చొరబాటు చేసి, భారత సైన్యంతో తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఈ యుద్ధం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఇప్పుడు, రెండు దశాబ్దాల తర్వాత, పాకిస్తాన్ మరోసారి ఇలాంటి దాడిని చేపట్టే అవకాశం ఉందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 1999లో, లాహోర్ ఒప్పందం తర్వాత శాంతి చర్చలు జరుగుతున్న సమయంలో, పాకిస్తాన్ సైన్యం, ఉగ్రవాద సమూహాలు కార్గిల్ రంగంలో చొరబాటు చేశాయి. ఈ దాడి భారత్‌కు ఊహించని దెబ్బగా మారింది. భారత సైన్యం ఆపరేషన్ విజయ్ ద్వారా ఈ చొరబాటును విజయవంతంగా అడ్డుకుంది, కానీ ఈ ఘటన రెండు దేశాల మధ్య విశ్వాస లోపాన్ని మరింత పెంచింది. ఈ చారిత్రక సంఘటన ఈ రోజు కూడా రెండు దేశాల సంబంధాలను విశ్లేషించడానికి ఒక ముఖ్యమైన సందర్భంగా నిలుస్తుంది. ప్రస్తుతం, భారత్, పాకిస్తాన్ మధ్య సంబంధాలు ఉద్రిక్తంగానే ఉన్నాయి. కాశ్మీర్ సమస్య, సరిహద్దు ఉగ్రవాదం, రెండు దేశాల రాజకీయ నాయకత్వం ఈ ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. అయితే, కొన్ని కీలక అంశాలు పాకిస్తాన్‌ను మరో కార్గిల్ లాంటి సాహసానికి దూరంగా ఉంచే అవకాశం ఉంది. సైనిక సన్నద్ధత: కార్గిల్ యుద్ధం తర్వాత, భారత్ తన సరిహద్దు భద్రత, గూఢచర్య వ్యవస్థను గణనీయంగా బలోపేతం చేసింది. ఇది రహస్య చొరబాట్లను కష్టతరం చేస్తుంది. అంతర్జాతీయ ఒత్తిడి: పాకిస్తాన్ ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతోంది. అంతర్జాతీయ సమాజం, ముఖ్యంగా అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలు, పాకిస్తాన్ సైనిక సాహసాలను సమర్థించే అవకాశం తక్కువ. అణ్వాయుధ భయం: రెండు దేశాలూ అణ్వాయుధ శక్తులుగా ఉన్నందున, ఏదైనా సైనిక ఘర్షణ విపరీత పరిణామాలకు దారితీయవచ్చు. పాకిస్తాన్ వ్యూహాత్మక లక్ష్యాలుపాకిస్తాన్ విదేశాంగ, రక్షణ విధానాలు ఎక్కువగా దాని సైనిక నాయకత్వంపై ఆధారపడి ఉంటాయి. కొందరు విశ్లేషకులు పాకిస్తాన్ తక్కువ?స్థాయి ఉగ్రవాద కార్యకలాపాలను కొనసాగించే అవకాశం ఉందని, కానీ కార్గిల్ లాంటి బహిరంగ సైనిక దాడిని నివారించవచ్చని భావిస్తున్నారు. దీనికి కారణాలు ఉన్నాయి. ఆర్థిక అస్థిరత: పాకిస్తాన్ ఆర్థిక సంక్షోభం సైనిక సాహసాలకు అవసరమైన వనరులను పరిమితం చేస్తుంది. అంతర్గత రాజకీయ సవాళ్లు: పాకిస్తాన్‌లో రాజకీయ అస్థిరత, ప్రభుత్వ?సైనిక సంబంధాలలో ఉద్రిక్తతలు దేశాన్ని బాహ్య సంఘర్షణల నుంచి దృష్టి మళ్లించాయి. చైనా, ఇతర మిత్రదేశాలు: కొందరు సోషల్ మీడియా వినియోగదారులు చైనా లేదా టర్కీ వంటి దేశాల నుంచి పాకిస్తాన్‌కు మద్దతు ఉండవచ్చని ఊహిస్తున్నారు. కానీ ఇవి ఆధారాలు లేని ఊహాగానాలు మాత్రమే. భారతదేశం సన్నద్ధత..భారతదేశం కార్గిల్ యుద్ధం నుంచి నేర్చుకున్న పాఠాలను దృష్టిలో ఉంచుకుని, సరిహద్దు భద్రతను మరింత బలోపేతం చేసింది. ఆధునిక డ్రోన్లు, శాటిలైట్ నిఘా, వేగవంతమైన సైనిక స్పందన వ్యవస్థలు భారత్‌ను ఏ రకమైన చొరబాట్లకైనా సిద్ధంగా ఉంచాయి. అదనంగా, భారత్ దౌత్య విధానం అంతర్జాతీయ సమాజంలో పాకిస్తాన్‌ను ఒంటరిగా చేయడంపై దృష్టి సారించింది. పాకిస్తాన్ మరో కార్గిల్ లాంటి సంఘర్షణను ప్రారంభించే అవకాశం ప్రస్తుత పరిస్థితులలో తక్కువగా కనిపిస్తుంది. అయితే, సరిహద్దు ఉగ్రవాదం చిన్న?స్థాయి ఘర్షణలు కొనసాగే అవకాశం ఉంది. భారతదేశం తన సైనిక సన్నద్ధతను కొనసాగిస్తూనే, శాంతియుత దౌత్య పరిష్కారాల కోసం కూడా కృషి చేయాలి. రెండు దేశాల మధ్య విశ్వాస నిర్మాణం, చర్చల ద్వారా మాత్రమే దీర్ఘకాలిక శాంతి సాధ్యమవుతుంది.

# అండమాన్ లో భారీగా చమురు నిల్వలు



న్యూఢిల్లీ, జూన్ 17, ఇప్పటికే భారత్ నాలుగో ప్రపంచ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. జపాన్ దేశాన్ని పక్కనపెట్టి.. జర్మనీని అధిగమించి.. మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి ప్రయత్నాలు చేస్తోంది. అదే గనక వాస్తవరూపం దాల్చితే జర్మనీ మన తర్వాతి స్థానంలోకి వెళ్లిపోతుంది. ఎలాగూ మూడో స్థానంలోకి వెళ్తాం కాబట్టి మన ముందు కేవలం డ్రాగన్, అమెరికా దేశాలు మాత్రవే ఉంటాయి. అప్పుడిక ఆ రెండు దేశాలను అధిగమించడానికి మనం ప్రయత్నాలు చేయాల్సి ఉంటుంది. అయితే అన్నీ మంచి శకునములే అన్నట్టుగా.. భారత్ రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి చేస్తున్న ప్రయత్నం ఫలించే విధంగా కనిపిస్తోంది. ఒకవేళ అదే గనుక వాస్తవరూపం దాల్చితే.. ప్రపంచంలోనే మనం రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంటాం. చైనాను సైతం పడగొట్టి.. అమెరికాకు సవాల్ విసిరేస్థాయిలో ఉంటాం. ఇంతకీ మన శాస్త్రవేత్తలు ఏం కనుగొన్నారు? కేంద్ర మంత్రి ఎలాంటి కీలక వ్యాఖ్యలు చేశారు? ఇంతకీ అండమాన్ సముద్రంలో ఏముంది? అది వెలికి తీస్తే ఏం జరుగుతుంది? ప్రపంచ గమనాన్ని మార్చుతుంది కేవలం ఒకటే ఒకటి. అదే ముడిచమురు. ఆ చమురు నిల్వలు ఉన్న దేశాలు ఆర్థికంగా పరిపుష్టంగా ఉన్నాయి. దుబాయ్ ప్రపంచంలోనే అతిపెద్ద వాణిజ్య నగరంగా ఏర్పడిందంటే దానికి కారణం చమురు మాత్రమే. ఆ చమురు కోసమే అమెరికా ఇరాన్, ఇరాక్ వంటి దేశాలపై యుద్ధాలు చేసింది. చమురు నిల్వలపై గుత్తాధిపత్యాన్ని సాధించడానికి రకరకాల ప్రయత్నాలు చేసింది. చివరికి ఎంతో కొంత విజయం సాధించింది. ఇక ఉక్రెయిన్ తో ఏళ్ల పాటు యుద్ధం సాగిస్తున్న రష్యా.. ఆర్థికంగా ఇప్పటికీ అదే స్థాయిలో ఉండడానికి ప్రధాన కారణం చమురు మాత్రమే. అందువల్లే చమురు ప్రపంచ ఆర్థిక రంగాన్ని శాసిస్తోంది. అయితే ప్రపంచంలోనే అతిపెద్ద జనాభా ఉన్న మనదేశంలో చమురు నిల్వలు అంతంత మాత్రమే. పైగా అవి మన దేశీయ అవసరాలకు సరిపోవు. అందువల్లే విదేశాల నుంచి ముడిచమురు దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. దీనికోసం భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక మనదేశంలో విస్తారంగా సముద్రాలు ఉన్నాయి. అయితే ఇలాంటి సముద్రతీరం ఉన్న ప్రధాన ప్రాంతాలలో అండమాన్ ఒకటి. ఈ అండమాన్ సముద్రంలో కొంతకాలంగా మన శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేస్తున్నారు. ఆ ప్రయోగాలు ఇప్పుడు సత్ఫలితాన్ని ఇచ్చినట్టు కనిపిస్తోంది. ఎందుకంటే అండమాన్ సముద్రంలో దాదాపు 11.6 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలు ఉన్నాయి. వీటిని కనుక వెలికి తీస్తే మన ఎకానమీ 3.7 ట్రిలియన్ డాలర్ల నుంచి 20 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు.. మన దేశం ముడిచమురు దిగుమతుల్లో ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది. ఈ చమురు కోసం భారీగా విదేశీ మారక నిల్వలను ఖర్చు చేస్తోంది. ఒకవేళ ఈ చమురు గనుక వెలికి తీసినట్టయితే.. అప్పుడు దేశ అవసరాలతో పాటు.. ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేసే అవకాశం ఉంటుంది. అప్పుడు మన దేశం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగుతుంది. ప్రపంచ దేశాలను అధిగమించి.. రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా.. అన్ని అనుకూలిస్తే ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది.

## ఆసిఫాబాద్ జిల్లాలో భారీగా నకిలీ విత్తనాలు

అదిలాబాద్, జూన్ 17,వర్షాకాలం మొదలైంది. రైతులు పంటలు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కానీ నకిలీ విత్తనాల సమస్య అన్నదాతలను వెంటాడుతోంది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నకిలీ విత్తనాల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. కొందరు అక్రమార్కులు అమాయక రైతులకు మాయమాటలు చెప్పి నిండా ముంచుతున్నారు. నకిలీ విత్తనాల విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా పోలీసులు అక్కడక్కడా మాటు వేసి పట్టుకుంటున్నా మోసాలు మాత్రం ఆగడంలేదుకుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఏటా వానాకాలంలో అత్యధికంగా 3.35 లక్షలకు పైగా ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేస్తుంటారు. దీనిని ఆసరా చేసుకున్న దళారులు జిల్లాలో కొన్నేళ్లుగా పత్తి విత్తనాల నకిలీ దందాను మొదలుపెట్టారు. ఈ దందా జిల్లాలోని సరిహద్దు మండలాల్లో మూడు పూవులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. జిల్లాలో గత రెండు నెలల్లో సుమారు రూ.కోటి విలువైన దాదాపుగా 3 వేల కిలోలకు పైగా నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. దీంతో జిల్లాలో ఏస్థాయిలో నకిలీ విత్తనాల దందా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని చింతలమానెపల్లి మండలంలో ఎల్,బిక్షపతి వద్ద రూ.10.50 లక్షల విలువైన మూడు క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు గత నెలలో పోలీసులు పట్టుకున్నారు. బెజ్జూర్ కు చెందిన కె.చంద్రశేఖర్ విజయవాడ నుంచి కాగజ్ నగర్ కు నకిలీ విత్తనాలు తరలించారు. ఏప్రిల్ 4న కాగజ్ నగర్ పట్టణంలో నవతా ట్రాన్స్ పోర్ట్ లో రూ.1.57 లక్షల విలువైన 45 కిలోల నకిలీ విత్తనాలు పట్టుకున్నారు. అందవెల్లి బోడపల్లి గ్రామాల్లో రూ.3.50 లక్షల విలువైన 100 కిలోల నకిలీ బీటీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. మే 7న పెంచికల్ పేట్ మండలంలో రెండు వాహనాల్లో తరలిస్తున్న రూ.12 లక్షల విలువైన 4 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకుని నలుగురిని అరెస్టు చేశారు. మే 24న కాగజ్ నగర్ మండలం పెద్దవాగు సమీపంలో ఐచర్ వాహనంలో తరలిస్తున్న రూ.60 లక్షల విలువైన 20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. మే 25న బెజ్జూర్ మండలం సుశ్మీర్ లో రూ.6 లక్షల విలువైన 170 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు. జిల్లాలో ఈసారి మొత్తం రూ.కోటి విలువ చేసే నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని చింతలమానెపల్లి, బెజ్జూర్, కౌటాల, సిర్పూర్(టీ), సరిహద్దు మండలాల కేంద్రంగా ఈ దందా జోరుగా సాగుతుందని ఆరోపణలున్నాయి. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన దళారులు ఖరీఫ్ సీజన్ కు ముందే నకిలీ విత్తనాలను జిల్లాకు సరఫరా చేస్తున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని మారుమూల మండలాలైన కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్పేట్, సిర్పూర్(టి), తదితర మండలాల్లో సబ్ ఏజెంట్లను నియమించుకుంటున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి నకిలీ పత్తి విత్తనాలు నిషేధిత గడ్డిమందును పలు ప్రైవేట్ ట్రాన్స్పోర్టులు, లారీల్లో జిల్లాకు చేరవేస్తున్నారు. మరోవైపు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పలువురు దళారులు గోదాంలను ఏర్పాటు చేసుకుని నకిలీ విత్తనాలు నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి కౌటాల మండలాల సరిహద్దులోని వార్ధా ప్రాణహిత నదుల మార్గాన నాటు పడవల్లో మండలాల్లోని సబ్ ఏజెంట్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ దందా ఏటా జిల్లాలో కొనసాగుతున్నప్పటికీ కేవలం చిన్న మొత్తంలో కొనుగోలు చేసి విక్రయిస్తున్న వారిని మినహా అసలు సూత్రధారులను పట్టుకున్న దాఖలాలు లేవు. ఆయా శాఖల అధికారులకు దందా చేసే అసలు వ్యక్తులు తెలిసినప్పటికీ మామూలుగానే వదిలేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో నకిలీ విత్తనాల వ్యాపారం రైతులను కలవర పెడుతోంది .వానాకాలం సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. భూసారం దెబ్బతినడంతో పాటు వాతావరణ కాలుష్యానికి కారణమవుతుందన్న శాస్త్రవేత్తల సూచనల మేరకు దేశంలో బీజీ 3 రకాలను నిషేధించారు.

# పాకిస్తాన్, ఇరాన్ కకావికలం

న్యూఢిల్లీ, జూన్ 17, )ప్రపంచంలో అగ్రదేశాలతో సమానంగా తమ వద్ద కూడా అన్వాయుధాలు ఉండాలని ఇస్లామిక్ దేశాలు కలలు కన్నాయి. అయితే ఇందులో కేవలం మూడు దేశాలు మాత్రమే ఒక అడుగు ముందుకు వేశాయి. కానీ వాటి కలలను అమెరికా, భారత్, ఇజ్రాయెల్ కల్లలు చేశాయి. ఇరాక్, ఇరాన్, పాకిస్తాన్ దశాబ్దాలుగా అణు శక్తి ఆయుధాల రంగంలో తమ ఆధిపత్యాన్ని స్థాపించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ మూడు దేశాల అణు కార్యక్రమాలు వివాదాస్పదంగా, అంతర్జాతీయ ఒత్తిళ్లకు కేంద్రంగా ఉన్నాయి. అయితే, అమెరికా ఇరాక్ అణు కార్యక్రమాలను ఆదిలోనే తుంచేసింది. సద్దాం హుస్సేన్‌ను చంపడంతోపాటు అక్కడి ప్రభుత్వం మార్చడం, అమెరికా సైనిక చర్యలతో ఇరాక్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమైంది. దీంతో అణ్వాయుధం తయారు చేయాలన్న ఇరాక్ కల చెదిరిపోయింది. ఇక ఇటీవలి పరిణామాలు ఇరాక్, పాకిస్తాన్ దేశాల అణు ఆశలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఇరాన్ అణు కార్యక్రమం, 2015లో జాయింట్ కాంప్రెహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ ద్వారా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. అయితే, 2018లో యునైటెడ్ స్టేట్స్ ఈ ఒప్పందం నుంచి వైదొలగడం, కఠిన ఆంక్షలు విధించడం వల్ల ఇరాన్ అణు కార్యక్రమం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. ఆర్థిక సంక్షోభం, అంతర్జాతీయ ఒడంబడికలలో విశ్వాసం కోల్పోవడం వల్ల ఇరాన్ అణు ఆకాంక్షలు దెబ్బతిన్నాయి. ఇటీవలి చర్చలు ఏఅఖూం ని పునరుద్ధరించడంలో విఫలమవడం, ఇజ్రాయెల్ నుంచి సైనిక ఒత్తిడి ఇరాన్‌ను మరింత ఇరుకున పెట్టాయిపాకిస్తాన్ 1998లో అణు పరీక్షలు నిర్వహించి, అణు శక్తి దేశంగా గుర్తింపు పొందింది. అయినప్పటికీ, ప్రస్తుత ఆర్థిక సంక్షోభం, రాజకీయ అస్థిరత, అంతర్జాతీయ ఆంక్షల భయం పాకిస్తాన్ అణు కార్యక్రమాన్ని దెబ్బతీస్తున్నాయి. అణు ఆయుధాల నిర్వహణ, ఆధునీకరణకు అవసరమైన ఆర్థిక వనరులు కొరవడటం, చైనాపై ఆధారపడటం పాకిస్తాన్‌ను ఒక గండిలో పడేసింది. అంతర్జాతీయ సమాజం నుంచి నిరంతర పరిశీలన, భారత్‌తో ఉద్రిక్తతలు ఈ సవాళ్లను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఇరాన్, పాకిస్తాన్‌లు అంతర్జాతీయ సమాజం నుంచి విభిన్న ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ నుంచి ఆంక్షలు, సైనిక బెదిరింపులు ఉండగా, పాకిస్తాన్‌పై ఆర్థిక సంక్షోభం, ఉగ్రవాద ఆరోపణలు ఒత్తిడి తెస్తున్నాయి. అణు ప్రసార నిరోధక ఒప్పందం వంటి అంతర్జాతీయ చట్రంలో ఈ దేశాలు సమర్థవంతంగా సహకరించలేకపోవడం వాటి అణు కార్యక్రమాలకు అడ్డంకిగా నిలుస్తోంది. ఇరాన్, పాకిస్తాన్ అణు కార్యక్రమాలు విఫలమవడం దక్షిణాసియా, మధ్యప్రాచ్య ప్రాంతాలలో శక్తి సమతుల్యతను ప్రభావితం చేస్తుంది. ఇరాన్ విషయంలో, అణు కార్యక్రమం ఆగిపోవడం ఇజ్రాయెల్, సౌదీ అరేబియా వంటి దేశాలకు వ్యూహాత్మక ప్రయోజనం కల్పిస్తుంది. పాకిస్తాన్ విషయంలో, అణు ఆయుధాల ఆధునీకరణలో వెనుకబడటం భారత్‌తో రక్షణ సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఈ రెండు దేశాలూ తమ అణు ఆకాంక్షలను కొనసాగించాలంటే, ఆర్థిక స్థిరత్వం, అంతర్జాతీయ సహకారం కీలకం. పాకిస్థాన్‌ను దెబ్బకొట్టిన భారత్..పహల్గాం ఉగ్రదాడకి ప్రతీకారంగా భారత్ చేపిట్టిన ఆపరేషన్ సిందూర్‌తో 9 ఉగ్రస్థావరాలతోపాటు 11 ఎయిర్ బేస్‌లు ధ్వంసమయ్యాయి. కిరాణా హిల్స్‌లోని పాకిస్థాన్ అణు మానిటరింగ్ సిస్టం దెబ్బతిన్నది. నూర్‌ఖాన్ ఎయిర్ బేస్‌పై దాడితో అమెరికాకు నష్టం కలిగింది. ఇక ఇజ్రాయెల్ దాడితో ఇప్పుడు ఇరాన్ అణ్వాయుధాలు కూడా దెబ్బతిన్నాయి. కనీసం మూడు దశాబ్దాలు వెనక్కి వెళ్లింది. అంటే అణ్వాయుధాలు పునరుద్ధరించుకోవాలంటే మరో 30 ఏళ్లు పడుతుంది. అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ టెహ్రాన్‌తోపాటు అణుస్థావరాలను ధ్వంసం చేసింది. ఆర్థికంగానూ ఇరాన్‌ను దెబ్బతీసింది. ఇరాక్, ఇరాన్, పాకిస్తాన్‌ల అణు కార్యక్రమాలు రాజకీయ, ఆర్థిక, అంతర్జాతీయ ఒత్తిళ్ల వల్ల చిన్నాభిన్నమవుతున్నాయి. ఈ దేశాలు తమ అణు ఆకాంక్షలను సాకారం చేసుకోవాలంటే, దౌత్యపరమైన సంబంధాలను మెరుగుపరచడం, ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడం అవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ దేశాల అణు కలలు అంతర్జాతీయ ఒత్తిళ్ల నీడలో కమిలిపోతున్నాయి.

# ఎనిమిదేళ్ల నుంచి నరకం

హైదరాబాద్, జూన్ 17, నగరంలో ట్రాఫిక్ తగ్గించే చర్యల్లో భాగంగా అంబర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టారు. 8 ఏండ్లుగా ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు సాగడంతో అంబర్ పేట ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎట్ట కేలకు ఇటీవలే ఫ్లై ఓవర్ అందుబాటులోకి వచ్చినా? పక్కా ప్రణాళిక కుండా ఏర్పాటు చేసిన ఫ్లై ఓవర్ నిర్మాణంతో స్థానిక ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. కనీసం సర్వీసు రోడ్లు వేయకుండానే ఫ్లై ఓవర్‌ను కేంద్ర, రాష్ట్ర మంత్రులు అధికారికంగా ప్రారంభించి చేతులు దులుపేసుకున్నారు. ప్రధానంగా అంబర్ పేట చే నంబరు చౌరస్తా నుంచి గోల్నాక వెళ్లే సర్వీసు రోడ్డు అందుబాటులోకి రాకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. అంబర్ పేట ఫ్లై ఓవర్ నిర్మాణానికి మొత్తం రూ.415 కోట్ల ఖర్చు కాగా, అందులో భూ నిర్వాసితుల కోసం జీహెచ్ఎంసీ నిధులు రూ.192 కోట్ల వాటాగా ఉంటే.. దాదాపు రూ.323 కోట్ల నిధులు నేషనల్ హైవే అథారిటీ వెచ్చించింది. 8 ఏండ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న అంబర్ పేట వాసులకు ఇటీవల ఫ్లై ఓవర్ అందుబాటులోకి వచ్చినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఇదిలా ఉంటే అంబర్ పేట చే నంబరు చౌరస్తా నుంచి గోల్నాక చౌరస్తా వరకు ప్రతి నిత్యం వేలాదిగా వాహన దారులు ప్రయాణిస్తుంటారు. ఫ్లై ఓవర్ నిర్మాణంలో భాగంగా ఈ సర్వీసు రోడ్డు కొన్నేండ్లుగా మూసి వేశారు. దీంతో చే నంబరు చౌరస్తా నుంచి జిందా తిలస్మాత్ మీదుగా గోల్నాక చౌరస్తా వరకు దాదాపు కిలో మీటరు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది.

# ప్రభుత్వ పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయం

హైదరాబాద్, జూన్ 17, అసాంఘిక కార్యకలాపాలకు ప్రభుత్వ పాఠశాలలు నిలయాలుగా మారుతున్నాయి. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న జిల్లెలగూడ చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శిర్లాయిల్స్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, లెనిన్ నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలలో గంజాయి రాయుళ్లు స్వైర విహారం చేస్తున్నారని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రగ్స్, గంజాయి సేవించిన మత్తులో ఏం చేస్తున్నారో వారికే తెలియడం లేదు. పాఠశాలలో ఉన్న లైట్లు, ఫ్యాన్లు, స్విచ్ బోర్డులు ధ్వంసం చేస్తున్నట్లు ఉపాధ్యాయుల పేర్కొంటున్నారు. ఇలా ఎందుకు చేస్తున్నారని అడిగేందుకు ప్రయత్నం చేస్తున్న తమపై గంజాయి రాయుళ్లు ఎదురుదాడికి పాల్పడుతున్నారని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేయడం, వాటర్ పైప్ లైన్లు, నల్లాలను సైతం ఎత్తుకుపోయినట్లు టీచర్లు పేర్కొంటున్నారు. జిల్లాలగూడ చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు లక్షల వరకు నష్టం జరిగినట్లు మండల విద్యాధికారి కృష్ణయ్య పేర్కొన్నారు. గంజాయి రాయుళ్లు చేస్తున్న అరాచకాలపై మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా టీచర్లకు, విద్యార్థినులకు రక్షణ లేకుండా పోతుందని వాపోయారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శిర్లాహిల్స్ లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో సైతం సైతం ఇలాంటి ఘటనలు పునరావృత్తం అవుతున్నట్లు టీచర్లు పేర్కొంటున్నారు. గంజాయి సేవిస్తున్న వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలకు రక్షణ లేకపోతే ఇక సుదూర ప్రాంతాలలో ఉన్న పాఠశాలల పరిస్థితి చెప్పనవసరం లేదు. ఉపాధ్యాయులు ఫిర్యాదులు చేస్తున్న పోలీసులు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. గంజాయి రాయుళ్లు ప్రభుత్వ పాఠశాలలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంటే పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడం పట్ల విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి నిరోధించడానికి కఠిన చర్యలు తీసుకోవాలని పదేపదే చెప్తున్నప్పటికీ ఎక్కడ కూడా సత్ఫలితాలు వచ్చిన సందర్భాలు కనిపిస్తలేవు. ప్రభుత్వ పాఠశాలలే కాకుండ, చెరువుల సమీపంలోనూ గంజాయి రాయుళ్లు తిష్ట వేస్తున్నారని కాలనీవాసుల నుంచి సైతం పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఎవరు ఎన్ని ఫిర్యాదులు చేసినా గంజాయి రాయుళ్లను నియంత్రించడంలో పోలీసులు విఫలం చెందుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదులకు స్పందించి గంజాయి రాయుళ్లపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడంపై పలు అనుమానాలకు తావిస్తున్నట్లు ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు.

జిల్లెల్లగూడ చల్లాలింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గంజాయి రాయుళు ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. లైట్లు, సీసీ కెమెరాలు, పైపులు ధ్వంసం చేశారు. రెండు లక్షల వరకు నష్టం జరిగింది. మళ్లీ రూ. 1,50,000 పెట్టి అన్ని రిపేర్ చేయించాం. మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాం. ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ కల్పించాలి. సాయంత్రం అయిందంటే గంజాయి రాయుళ్లు తిష్ట వేస్తున్నారు అని ఎంఈవో పేర్కొన్నారు.

# నార్త్ రింగరోడ్డుకు మహర్దశ

హైదరాబాద్, జూన్ 17,తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంగతి తెలిసిందే. ఉత్తర, దక్షిణ రెండు భాగాలుగా ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగు రోడ్డు నుంచి సుమారు 40 కి.మీ దూరంతో ఈ ప్రాజెక్టుని నిర్మిస్తున్నారు. అయితే ఉత్తర భాగం పనుల టెండర్లపై ప్రస్తుతం ఉత్కంఠ కొనసాగుతోంది. బిడ్లు సమర్పించడానికి జూన్ 18 వరకు మాత్రమే గడువు ఉండగా.. 19న టెండర్లను తెరవాల్సి ఉంటుంది. గతేడాది డిసెంబరు 27న భారత జాతీయ రహదారుల అధికార సంస్థ ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం పనుల కోసం ఐదు ప్యాకేజీలుగా టెండర్లను ఆహ్వానించింది. కానీ ఆరు నెలలుగా ప్రతి నెలా టెండర్ల గడువును పొడిగిస్తూ వస్తోందిఇక ఉత్తర భాగాన్ని ముందుగా నాలుగు వరుసల రహదారిగా నిర్మించాలనుకున్నా.. ఆరు వరుసల రహదారిగా విస్తరించే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అయితే ఆరు వరుసల విస్తరణకు కేంద్ర మంత్రివర్గం నుండి ఇంకా ఆమోదం లభించలేదు. ఆరు వరుసల రహదారికి మార్చాల్సి వస్తే.. ఎన్‌హెచ్‌ఏఐ మళ్లీ టెండర్లను పిలవాల్సి ఉంటుంది. ఇందుకోసం ఇప్పటికే ట్రాఫిక్ సర్వేతో పాటు మరోసారి డీపీఆర్‌పై అధ్యయనం చేసింది. రెండు రోజుల్లో బిడ్ల దాఖలు గడువు ముగియనుండటంతో ఎన్‌హెచ్‌ఏఐ గడువును మళ్లీ పొడిగిస్తుందా? లేక కొత్త ప్యాకేజీలతో ఆరు వరుసల రహదారికి టెండర్లను పిలుస్తుందా? అనే సందిగ్ధత కొనసాగుతోంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం పనులను వేగవంతం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఇవాళ మంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో ఆర్‌ఆర్‌ఆర్ పనులపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. తెలంగాణ ప్రభుత్వం ఉత్తర భాగంతో పాటు దక్షిణ భాగం పనులను కూడా చేపట్టాలని కేంద్రాన్ని తరచుగా కోరుతోంది. ఒకవేళ కేంద్రం ఆమోదించకపోతే రాష్ట్ర ప్రభుత్వమే ఈ పనులను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం. హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ప్రాజెక్టు విషయానికొస్తే.. మె?త్తం పొడవు సుమారు 340 కిలోమీటర్లు. ఉత్తర భాగం సుమారు 161 కిలోమీటర్లు (సంగారెడ్డి – నర్సాపూర్ – తూప్రాన్ – గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ – యాదాద్రి – భువనగిరి – చౌటుప్పల్) వరకు దక్షిణ భాగం పనులు సుమారు 182 కిలోమీటర్లు (చౌటుప్పల్ – శివన్నగూడెం – కందుకూరు – ఆమన్‌గల్ – చేవెళ్ల – శంకర్‌పల్లి – సంగారెడ్డి) వరకు నిర్మించనున్నారు. మొత్తం ప్రాజెక్టుకు సుమారు రూ.17 వేల కోట్ల నుంచి రూ.21 వేల కోట్లు. 2026 నాటికి ఉత్తర భాగం, 2027–2028 నాటికి దక్షిణ భాగం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ నగరం చుట్టూ కనెక్టివిటీ మెరుగుపడి, ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. అంతేకాకుండా హైదరాబాద్ చుట్టూ స్థిరాస్థి రంగం పుంజుకుంటుంది.

### వినాయకసాగర్ లో పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి.
### కమిషనర్ ఎన్.మౌర్య

వినాయక సాగర్ అభివృద్ధి పనుల్లో పెండింగ్ లో ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం వినాయక సాగర్ ను, కొర్లగుంట వద్ద జరుగుతున్న డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వినాయక సాగర్ లో స్విమ్మింగ్ పూల్, గ్లో గార్డెన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సాగర్ వాకింగ్ ట్రాక్ నందు పెరిగిన మొక్కలు కత్తిరించి వాకర్స్ కు ఇబ్బంది లేకుండా చేయాలని అన్నారు. అక్కడ ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటాలని అన్నారు.

# సెహభాష్... సరిత

నల్గొండ జూన్ 17, ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు నేడు అన్ని రంగాల్లోనూ రాణించి చరిత్ర సృష్టిస్తున్నారు. తాజాగా.. సరిత అనే తెలంగాణ ఆర్టీసీ తొలి మహిళా బస్ డ్రైవర్‌గా రికార్డు సృష్టించారు. జూన్ 14న డ్యూటీలో చేరిన ఆమె.. మొదటి రోజు హైదరాబాద్ నుంచి నల్గొండ జిల్లా మిర్యాలగూడకు ఆర్టీసీ బస్సు నడిపారు. ఢిల్లీలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తించిన సరిత.. ప్రత్యేక అనుమతితో తెలంగాణ ఆర్టీసీలో చేరారు. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు ఇప్పుడు సరికొత్త చరిత్రను లిఖిస్తున్నారు. అన్ని రంగాల్లోనూ తమదైన ముద్రవేస్తున్నారు. తమ నైపుణ్యాలు, ప్రతిభతో గొప్ప విజయాలు సాధిస్తున్నారు. తాజాగా.. తెలంగాణ ఆర్టీసీలో తొలి మహిళా బస్ డ్రైవర్‌గా సరిత అనే మహిళ విధుల్లో చేరి రికార్డు సృష్టించింది. డ్యూటీలో చేరిన ఆమె.. మె?దటి రోజు హైదరాబాద్ నుంచి మిర్యాలగూడకు ఆర్టీసీ బస్ నడిపారు. ఇన్నిరోజులు దేశ రాజధాని ఢిల్లీలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తించిన సరిత ప్రత్యేక అనుమతితో తెలంగాణ ఆర్టీసీలో చేరారు. పురుషాధిక్య రంగంగా భావించే రవాణా రంగంలో సరిత లాంటి మహిళలు అడుగుపెట్టి సమర్థవంతంగా విధులు నిర్వర్తించడం స్త్రీ సాధికారతకు నిలువెత్తు నిదర్శనం. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సీత్య తండాకు చెందిన వాంకుడోతు సరిత జీవితం ఎన్నో కష్టాలు, సవాళ్లతో కూడుకున్నది. వాంకుడోతు రాంకోటి, రుక్కా దంపతులకు ఆరుగురు సంతానంలో ఐదో అమ్మాయి సరిత. నలుగురు అక్కల పెళ్లి కోసం తన తండ్రి ఉన్న మూడెకరాల భూమిని అమ్మివేయడంతో కుటుంబ పోషణ భారమైంది. దీంతో పదో తరగతి మధ్యలోనే చదువు ఆపేసి తండ్రికి చేదోడు వాదోడుగా నిలిచింది. వేసవి సెలవుల్లో దేవరకొండలోని అక్క ఇంటికి వెళ్లిన సరిత తన బావ వద్ద ఆటో నడపడం నేర్చుకుంది. దురదృష్టవశాత్తు కొన్నాళ్లకే బావ అనారోగ్యంతో మరణించడంతో తల్లిదండ్రులు, తమ్ముడితో పాటు అక్క బాధ్యతను కూడా సరిత తన భుజాలపై వేసుకుంది. దేవరకొండ ప్రాంతంలో ఆటో నడపడం మొదలుపెట్టింది. ఆటో నడుపుతున్నప్పుడు ఆకతాయిల అల్లరి ఎక్కువ కావడంతో సరిత తన ఆహార్యాన్ని మార్చుకుంది. జుట్టు కత్తిరించుకుని, ప్యాంటు, షర్టు ధరించి పురుషుడిలా తయారైంది. ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తూ.. ప్రైవేట్‌గా పదో తరగతి పాసై హెవీ మోటార్ డ్రైవింగ్ లైసెన్స్ కూడా పొందింది. 2010లో నల్లగొండ ఆర్టీసీ డిపోలో డ్రైవర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కాగా.. సరిత దరఖాస్తు చేసుకుంది. మహిళల నుంచి వచ్చిన ఏకైక దరఖాస్తు ఆమెదే. అయితే ఆ సమయంలో అధికారులు ఆడవారిని డ్రైవర్లుగా తీసుకోలేమని ఆమె దరఖాస్తును తిరస్కరించారు. అయినా సరిత వెనకడుగు వేయలేదు. ఆమె పట్టుదల, ఆత్మవిశ్వాసంతో తన కలను నిజం చేసుకోవడానికి మరింత దృఢంగా ప్రయత్నించింది. కొన్ని సంవత్సరాల పాటు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాల బస్సును కూడా నడిపారు. 2014లో ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ లో డ్రైవర్‌గా ఎంపికయ్యారు. దేశంలోనే ప్రభుత్వ రంగంలో బస్సు నడిపిన మొదటి మహిళా డ్రైవర్‌గా ఆమె గుర్తింపు పొందారు. ఆమె సరోజిని నగర్ డిపోలో పనిచేస్తూ రోజుకు సుమారు 135 కి.మీ బస్సు నడిపేవారు. ఢిల్లీలో ఆమె సేవలకు మంచి గుర్తింపు లభించింది. ఆమె అనేక అవార్డులు, రివార్డులు అందుకున్నారు. 2018లో రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ చేతుల మీదుగా ప్రత్యేక పురస్కారం, కిరణ్ బేడీ వంటి ప్రముఖుల చేతుల మీదుగా 'ఉమెన్ అచీవర్స్' అవార్డును అందుకున్నారు. ఢిల్లీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా ఉండటం, ఖర్చులు ఎక్కువగా ఉండటంతో సరిత తెలంగాణకు తిరిగి రావాలని భావించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిసి తనకు ఆర్టీసీలో ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఆయన రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌లతో మాట్లాడి.. స్పెషల్ రిక్రూట్‌మెంట్ కింద ఆమెకు ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఆమె విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన తెలంగాణ ప్రభుత్వం టీఎస్ఆర్టీసీలో అవకాశం కల్పించింది. తాజాగా.. హైదరాబాద్ నుంచి మిర్యాలగూడకు బస్సును నడిపి ఆర్టీసీలో తొలి మహిళా డ్రైవర్‌గా రికార్డు సృష్టించారు. మహిళలు కూడా పురుషులతో సమానంగా సవాళ్లతో కూడిన రంగంలో రాణించగలరని నిరూపించి అనేక మందికి స్ఫూర్తిగా నిలిచారు. సరిత ప్రయాణం మహిళా సాధికారతకు ఒక ఉదాహరణ. ఆమె సాహసం, సంకల్పం అనేక మందికి ఆదర్శంగా నిలిచాయి

# సొంత సామాజిక వర్గంలా అసంతృప్తులు

హైదరాబాద్, జూన్ 17, కాంగ్రెస్ పార్టీ నాయకత్వం మీద ఆ సామాజికవర్గం అలకబూనిందా? ఎప్పుడూ పైచేయిగా ఉండే?. మమ్మల్ని ఇప్పుడు పట్టించుకోవడం లేదంటూ నారాజ్ అవుతున్నారా? ఇటీవల జరిగిన పరిణామాలను ఆ కుల పెద్దలు అస్సలు జీర్ణించుకోలేకపోతున్నారా? అధికార పార్టీ మీద కోపంగా ఉన్న ఆ సామాజికవర్గం ఏది? ఎక్కడ తేడా కొట్టింది? తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అంటేనే?. రెడ్ల పార్టీ అని ఓ ముద్ర ఉంది. రాజకీయ వర్గాల్లో కూడా ఇదే విస్తృతాభిప్రాయం. లెక్కల ప్రకారం చూసుకున్నా కూడా? ఆ సామాజిక వర్గం ఓటు బ్యాంక్ ఎప్పుడూ? కాంగ్రెస్ పార్టీకే అండగా ఉంటుంది. అలాగే?. పార్టీలో కూడా రెడ్డి నాయకులదే పైచేయిగా నడుస్తూ ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అయినా? విభజన తర్వాత తెలంగాణలో అయినా? ఇది అనాదిగా వస్తున్నదే. తెలంగాణలో కూడా ఇప్పటిదాకా జరిగిన అన్ని పరిణామాల్లో రెడ్డి నేతలదే పైచేయి అయిందిగానీ?? ఇటీవల జరుగుతున్న పరిణామాలతో ఆ సామాజిక వర్గానికి ప్రాధాన్యత తగ్గుతోందా అన్న అనుమానాలు వస్తున్నాయట. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేసిన తర్వాత? సామాజిక న్యాయానికి కట్టుబడి ఉండాలన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఎవరి జనాభా ఎంతో వారికి అంత వాటా ఇవ్వాలని డిసైడ్ అయినట్టు చెప్పుకుంటున్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో కూడా మాల, మాదిగ, బీసీ సామాజిక వర్గాలకు పెద్దపీట వేసింది ప్రభుత్వం. కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఏ పదవుల భర్తీ అయినా అందులో కచ్చితంగా రెడ్డి సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఉండేది. కానీ?తాజాగా జరిగిన మంత్రివర్గ విస్తరణలో రెడ్లకు చోటు లేకుండా పోయింది. దీంతో ఆ సామాజికవర్గం అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. పైగా ఆశావహుల్లో రెడ్డి నాయకులే ఎక్కువగా ఉండటంతో అసంతృప్త స్థాయి కూడా ఎక్కువగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇది రోజురోజుకూ పెరిగిపోతున్న క్రమంలో మరో కొత్త వాదన వినిపిస్తోంది పార్టీ వర్గాల్లో. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత జరిగే విస్తరణలో రెడ్లకు ప్రాధాన్యత దక్కే అవకాశం ఉందని అంటున్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో పదవుల భర్తీ కూడా జరిగింది. ఉపాధ్యక్షులు, పార్టీ ప్రధాన కార్యదర్శి పదవుల భర్తీలో కూడా జనాభా ప్రాతిపదికన తీసుకున్నారు. ఇందులో 68 శాతం బీసీ, ఎస్సీ, మైనార్టీలకు కేటాయించారు. అంతవరకు బాగానే ఉందిగానీ అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు కొందరు పార్టీ నాయకులు. సామాజిక న్యాయం చేయాలన్న ఆలోచన మంచిదే గానీ పార్టీకి వెన్నెముకగా ఉన్న సామాజిక వర్గాలను దూరం చేసుకోవడం కూడా మంచిది కాదంటూ సలహాలిస్తున్నారట. అటు సోషల్ జస్టిస్ పేరుతో కనీసం ప్రభుత్వం కానీ? పార్టీ నాయకత్వం గానీ జనంలోకి వెళ్లి చర్చించే ప్రయత్నం చేయడం లేదు. తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం పనులు చేసుకుంటూ పోతోందిగానీ ఆ విషయాన్ని ఆయా వర్గాలకు చేర్చాల్సిన పార్టీ మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణ తీసుకోలేదు. దీంతో కొత్తగా అమలు చేస్తున్న సామాజిక న్యాయం కారణంగా ఏయే వర్గాలు ఎంత బెనిఫిట్ అవుతాయన్న వివరాలు కనీసం ఆ కులాలకు కూడా చేరడం లేదు. ఇలాంటి వాటిని పూర్తిస్థాయిలో చెప్పుకోగలిగినప్పుడే ఇటు పార్టీకి, అటు ప్రభుత్వానికి ఉపయోగం అన్నది నేతల అభిప్రాయం. కానీ అంతా అలా మాట్లాడుకునే వాళ్ళేగానీ క్షేత్ర స్థాయిలో చెప్పే ప్రయత్నం మాత్రం ఎవ్వరూ చేయడం లేదన్న అసంతృప్తి పెరుగుతోంది. పార్టీకి వెన్నంటి ఉన్న సామాజిక వర్గాలకు దగ్గరవడం ఒక ఎత్తయితే మారుతున్న పరిస్థితుల్లో అనుసరించే వ్యూహాలను జనంలోకి విస్తృతంగా తీసుకుపోవడం మరో ఎత్తు. కానీ? ఆ పని మాత్రం జరగడం లేదని చెప్పుకుంటున్నారు. పార్టీ నాయకత్వం ఆ దిశగా ఆలోచిస్తేనే ఉపయోగం అన్న అభిప్రాయం బలపడుతోంది. సామాజిక న్యాయం పరంగా మెజార్టీ జనాభాకు మెజార్టీ పదవులన్న సూత్రాన్ని పాటిస్తూ పార్టీకి వెన్నుదన్నుగా ఉండే కులాలను సంతృప్తి పరచడం కత్తిమీద సామే అయినా చాలా జాగ్రత్తగా చెయ్యక తప్పదని అంటున్నారు పరిశీలకులు. దీంతో ప్రస్తుతం నారాజ్‌గా ఉన్న రెడ్లను కాంగ్రెస్ అధిష్టానం ఎలా సంతృప్తి పరుస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

# తెలంగాణలో పోస్టుల భర్తీకి జాప్యం దేనికి..

నల్గొండ జూన్ 17, తెలంగాణ కాంగ్రెస్ విషయంలో ఏఐసీసీ పెద్దలకు క్లారిటీ లేకుండా పోయిందా? తొమ్మిది నెలల నుంచి పోస్టల భర్తీలో ఎందుకు కన్ఫ్యూజ్ అవుతోంది? అరకొర కమిటీతో ఇంకెన్నాళ్ళు బండి లాగిస్తారు? అత్యంత కీలకమైన పదవుల భర్తీకి ఇంకెన్నేళ్ళు పడుతుంది? పార్టీ పెద్దల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదా? లెట్స్ వాచ్. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా?. మహేష్ గౌడ్‌ను నియమించిన ఏఐసీసీ ఆయనకి టీంని సమకూర్చడానికి తొమ్మిది నెలలు పట్టింది. అయినాసరే? ఇప్పటికీ పూర్తి స్థాయిలో పీసీసీ కమిటీ నియామకం జరగలేదు. కేవలం ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను మాత్రమే నియమించి చేతులు దులుపుకుంది పార్టీ అధిష్టానం. ఇంకా సీనియర్ వైస్ ప్రెసిడెంట్స్, వర్కింగ్ ప్రెసిడెంట్స్, కార్యదర్శుల్ని నియమించాల్సి ఉంది. ప్రచార కమిటీ చైర్మన్‌ని కూడా నియమిస్తారని చెప్పుకున్నా? అదికూడా పెండింగ్‌లోనే ఉంది. ఈ పోస్టలన్నిటినీ ఎప్పుడు భర్తీ చేస్తారో కూడా ఇప్పటికీ క్లారిటీ లేదు. అటు అతి ముఖ్యమైన వర్కింగ్ ప్రెసిడెంట్స్ ఎంపిక కూడా పేచీలతో ఎప్పటికప్పుడు వాయిదా పడుతూనే ఉంది. పార్టీ నాయకత్వానికి, సీనియర్ లీడర్స్‌కు మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో?. వర్కింగ్ ప్రెసిడెంట్స్ నియామకం కొలిక్కి రావడం లేదట. పార్టీ రాష్ట్ర నాయకత్వం సూచించిన ఓ పేరును ఆమోదించేందుకు ఇన్చార్జ్? ససేమిరా అంటున్నట్టు సమాచారం. అటు పార్టీ వర్కింగ్ ప్రెసిడింగ్ పోస్టుల్లో కూడా సామాజిక న్యాయం కోసం ప్రయత్నిస్తోందట అధిష్టానం. ఈ క్రమంలో ఎస్టీల నుంచి ఎంపీ బలరాం నాయక్, మరోనేత బెల్లయ్య నాయక్ పేర్లు పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. మాదిగ సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ పేర్లు పరిశీలనలో ఉన్నాయట. ఇక రెడ్ల నుంచి రోహిణ్ రెడ్డి పేరు దాదాపు ఖరారైనట్టు సమాచారం. ఇప్పుడు పేచీ అంతా మైనార్టీ విభాగం నుంచి ఎవరిని తీసుకోవాలన్న దగ్గరేనట. అట్నుంచి ఫయీం, ఫిరోజ్ ఖాన్‌తో పాటు మరో ఇద్దరి పేర్లు పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టుల్ని వీలైనంత త్వరగా భర్తీ చేసి ప్రజల్లోకి వెళితేనే? పార్టీకైనా, ప్రభుత్వానికైనా ఉపయోగమని, ఇక ఎంత ఆలస్యం అయితే? అంత నష్టం జరిగినట్టేనని అంటున్నాయి తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులు.

# షాద్ నగర్ రాజకీయం లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం

షాద్ నగర్,రాష్ట్రాన్ని కుదిపేస్తున్న ఫోన్ టైపింగ్ వ్యవహారం షాద్ నగర్ పట్టణం రాజకీయానికి తగిలింది. బీజేపీ నాయకుడు విష్ణు వర్ధన్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుండి టికెట్ ఆశించి, టికెట్ రాకపోవడంతో ఫార్వార్డ్ బ్లాక్ నుండి ఎన్నికల బరిలో దిగారు. ఎన్నికల అనంతరం తిరిగి బీజేపీ గూటికి చేరారు. విష్ణువర్ధన్ రెడ్డి విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ... ఈనెల 14వ తేదీన తనకు జూబ్లీహిల్స్ పోలీసుల నుండి నోటీసు అందిందని, పోలీసు విచారణ జాబితాలో తన ఫోన్ నెంబర్ ఉందని, దీనిపై విచారించాలని పిలుపురాగా ఆ నోటీసు అందుకొని విచారణకు హాజరైనట్లు తెలిపారు. నవంబర్ 15 నుండి 30వ తేదీ వరకు సంబంధించిన మీ ఫోన్ డేటా వివరాలు తమ వద్ద ఉన్నాయని, అంతకు ముందు ఉన్న డేటా లేదని పోలీసులు విచారణలో చెప్పినట్లు తెలిపారు. తన నెంబర్ 9618567566 నెంబర్ ట్యాపింగ్ జరిగిందని పోలీసులు ధ్రువకరించినట్లు విష్ణువర్ధన్ రెడ్డి మీడియాకు తెలిపారు. ఆ మధ్య కాలంలోనే తనపై 8 ఎన్నికల కేసులు ఉద్దేశపూర్వకంగా జరిగినట్లు కూడా విష్ణువర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ అంశంలో తన ఫోన్ ను చట్ట విరుద్ధంగా ట్యాపింగ్ చేసిన వారు ఎవరైనా సరే, ఎంత పెద్దలైనా సరే, ఏ పార్టీ వారు అయినా సరే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తన గోప్యతను భంగపరిచే హక్కు ఎవరికీ లేదన్నారు. ముఖ్యంగా తన ఫోన్ ట్యాపింగ్ జరిగాక తాను ఎవరెవరితో ఏం మాట్లాడానో, ఎన్నికల్లో జర్నలిస్టులు, ముఖ్య నేతలు, అధికారులు, తన బంధువులు, పార్టీ కార్యకర్తలు, తన భార్యాపిల్లలు ఎవరెవరితో సంభాషించానో వీటన్నింటినీ దొంగచాటుగా విని తన ప్రాథమిక హక్కును హరించారని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను ఇంకా దీనికి సంబంధించిన నాయకులు ఎవరైనా సరే చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# కొండాపూర్ మల్టీ లెవల్ ఫ్లై ఓవర్ ను పరిశీలించిన జీహెచ్ఎంసి కమిషనర్

హైదరాబాద్,గచ్చిబౌలి ఓఆర్ఆర్ నుంచి టూ కొండాపూర్ మల్టీ లెవల్ ఫ్లైఓవర్ త్వరలో అందుబాటులోకి రానుంది. ఆ పనులను జీహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ మంగళవారం పరిశీలించారు. త్వరలో ఈ ఫ్లైఓవర్ సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. జీహెచ్ంఎసి 178 కోట్ల రూపాయలతో ఫ్లైఓవర్ నిర్మాణం చేసింది. 1.2 కిలోమీటర్ల పొడవు. 24 మీటర్ల వెడల్పు. ఆరు లేన్ల తో ఫ్లైఓవర్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే గచ్చిబౌలి ప్రాంతం లో ఉన్న రెండు ఫ్లైఓవర్లపై నిర్మించిన థర్డ్ లెవెల్ ఫ్లైఓవర్ ఇది. ఓఆర్ఆర్ నుండి కొండాపూర్, హఫీజ్ పేట్ మార్గాల్లో వెళ్లే వాహనాలకు రాకపోకలు ఈజీ కానున్నాయి. ఫ్లైఓవర్ ద్వారా హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ కు కనెక్టివిటీ మెరుగయింది. కొండాపూర్ నుంచి ఎయిర్ పోర్ట్ కు వెళ్ళే వారికి గచ్చిబౌలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ చిక్కులు లేకుండా ఫ్లైఓవర్ పై నుంచి జర్నీ సులభం కానుంది..

# కొత్తగా ఆటో రిక్షా పర్మిట్లు జారీ, రవాణా రంగ సంక్షేమ బోర్డు ఏర్పాటు ప్రతిపాదన పై హర్షం

**ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జేఏసీ**

**దీర్ఘకాలికంగా పెండింగ్ లోఉన్న ఆటో మీటర్ చార్జీలు తక్షణమే పెంచాలి**

**కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు హామీ ఇచ్చిన రూ.12.000/- ఆర్థిక సహాయం వెంటనే అందజేయాలి**

**బైక్ టాక్సీ లను వెంటనే నిషేధించాలి**

హైదరాబాద్,నగరంలో కొత్త ఆటో రిక్షా పర్మిట్లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం జిఓ జారీ చేసినందుకు మరియు రవాణా రంగ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వ ప్రతిపాదన ప్రకటించడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జేఏసీ హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జేఏసీ నేతలు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్, బషీర్ బాగ్, దేశోద్ధారక భవన్ లో సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం (ఎఐటియుసి), వి.మారయ్య, మహేష్ (బిఆర్టియు,) పి.శ్రీకాంత్, అజయ్బాబు (సిఐటియు), వి.ప్రవీణ్ (టియుసిఐ), ఎం.ఎ.సలీం, నజీర్, రఫీక్ (యుటిఎడిడబ్ల్యుఎ,) పి.రాంరెడ్డి (ఐఎఫ్టియు), పి. యాదగిరి (టీఎస్టీయూసీ) ఎస్.కె.పి. జమ (జిహెచ్ఎడియు) లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి. వెంకటేష్ మాట్లాడుతూ కొత్తగా ఆటో రిక్షా పర్మిట్లు జారీకి, రవాణా రంగ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు గత రెండు దశాబ్దాలుగా అనేక రూపాల్లో పోరాటాలు నిర్వహించామని, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, ఎమ్మెల్సీ ప్రో. ఏం. కోదండరాం లు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, పలుమార్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేర్చలు జరిపి జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలో కొత్తగా 60 వేల ఆటో రిక్షా పర్మిట్లు ఇవ్వడానికి ప్రభుత్వ జిఓ జారీ కృషి చేసారని అలాగే రవాణా రంగ సంక్షేమ బోర్డు ఏర్పాటు ప్రతిపాదన ప్రకటింపజేశారని తెలిపారు. 2023 సంవత్సరం నుండి ఆటో మీటర్ చార్జీలు నాటి ప్రభుత్వాలు పెంచకుండా నిర్లక్ష్యం వహించడంతో ఆటో డ్రైవర్లు అనేక ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆటో మీటర్ చార్జీలు మినిమం ఛార్జి రూ.50/–, కిలోమీటర్ కు రూ. 20/– పెంచాలని, ఎన్నికల మానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు హామీ ఇచ్చిన రూ.12.000/– ఆర్థిక సహాయం వెంటనే అందజేయాలని అలాగే ఆటో డ్రైవర్ల పొట్టకొడుతున్న ఓలా, ఊబర్, రాపిడోల బైక్ టాక్సీ లను నిషేదించాలని బి.వెంకటేశం విజ్ఞప్తి చేసారు. .

# టీడీపీకి కోవర్టుగా వాసుపల్లి



విశాఖపట్టణం, జూన్ 17, మాజీ ఎమ్మెల్యే కదలికలు అనుమానాస్పదంగా ఉన్నాయా? ఆయన మాటలు ఇప్పుడే ఎందుకు తేడాగా వినిపిస్తున్నాయి? మామీద మీ పెత్తనం ఏంటి? ఎక్కువ చేస్తే? పార్టీ ఆఫీస్ మెట్లు కూడా ఎక్కబోమని ఎందుకు అంటున్నారు? చచ్చేదాకా వైసీపీలోనే ఉంటానని ఒకవైపు చెబుతూనే? మరోవైపు స్వరం మారుస్తున్న ఆ మాజీ ఎవరు? ఆయనకు వచ్చిన ఇబ్బంది ఏంటి? ఉత్తరాంధ్ర వైసీపీలో ఒక్కొక్కటిగా అసమ్మతి స్వరాలు పెరుగుతున్నాయా అంటే? అవును, అలాగే కనిపిస్తోందంటున్నారు పొలిటికల్ పండిట్స్. అందుకు తాజా ఉదాహరణగా? విశాఖ దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ని చూపిస్తున్నారు. అంతకు ముందు సంగతి ఎలా ఉన్నా?. ఇటీవల వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ వేదికగా ఆయన అన్న మాటలు, లేవనెత్తిన ప్రశ్నలు చర్చనీయాంశం అవుతున్నాయి. ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ వ్యవస్థ పార్టీ అధినేతకు, తమకు మధ్య అడ్డుగోడగా మారిందన్న మాటల చుట్టూ రకరకాల విశ్లేషణలు పెరుగుతున్నాయి. గతంలో ఆ పోస్ట్‌లో ఉన్న విజయసాయిరెడ్డి చర్యలవల్ల ఒక్కో నియోజకవర్గంలో కనీసం 10వేల ఓట్లు కోల్పోయామన్న రాజకీయ సూత్రీకరణను తెరపైకి తెచ్చారు వాసుపల్లి. అలాంటి వ్యవస్థ ఇప్పటికీ అవసరమా?? అన్న అభిప్రాయంతో?. ప్రస్తుత కో ఆర్డినేటర్ కన్నబాబును కోట్ చేస్తూ? మాట్లాడ్డాన్ని కాస్త తేడాగానే చూస్తున్నాయట వైసీపీ వర్గాలు. ఇప్పుడు కూడా పాత పద్ధతులనే కొనసాగిస్తామని చెబితే? పార్టీ ఆఫీసులోకి కూడా అడుగు పెట్టబోనంటూ?. తీవ్రమైన వ్యాఖ్యలే చేశారు మాజీ ఎమ్మెల్యే. దీంతో వాసుపల్లి ఆలోచన ధోరణి వైసీపీ లో విస్తృత చర్చ జరుగుతోందట. ఓవైపు కూటమి ప్రభుత్వం ఏడాది వైఫల్యాలపై పోరాటానికి సమాయత్తం అవుతున్న టైంలో?. వాసుపల్లి లాంటి వాళ్ళు పాత చేదు జ్ఞాపకాలతోనే సహవాసం చేయడం ఏంటని మాట్లాడుకుంటున్నాయట పార్టీ వర్గాలు. ఇక్కడ టీడీపీతో పోలిక తీసుకురావడం మరింత ఇబ్బంది మారిందట వైసీపీ నాయకత్వానికి. వాసుపల్లి గణేష్ రాజకీయంగా ఎదిగింది, రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచింది టీడీపీలోనే. 2014, 2019లో విశాఖ దక్షిణ స్థానం నుంచి గెలిచారాయన. ఆ సమయంలో నేరుగా చంద్రబాబుతో మాట్లాడే అవకాశం ఉండేదని?కానీ? వైసీపీ అధికారంలో ఉన్నా?ప్రతిపక్షం లో కూర్చున్నా?. నియోజకవర్గ సమస్యల గురించి పార్టీ అధ్యక్షుడు జగన్‌కు నేరుగా రిపోర్ట్ చేసే అవకాశం లేకుండా పోయిందని, అదే అతిపెద్ద సమస్య అంటున్నారట ఈ మాజీ.వాస్తవానికి 2024 ఎన్నికల ఫలితాలు మిగిలిన నియోజకర్గాలతో పోలిస్తే వాసుపల్లికి అతిపెద్ద షాక్. జనసేన పోటీ చేయడం, ప్రత్యర్థి వంశీకృష్ణ పొరుగు నియోజకవర్గం నుంచి రావడం, రెండు సార్లు గెలిచిన తన అనుభవం అన్నీ కలిసొచ్చి స్వల్ప మెజారిటీతో అయినా.. బయటపడతానని అనుకున్నారట ఆయనకానీ? ఆ అంచనాలను తల్లకిందులు చేస్తూ? ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ 64వేలకు పైగా మెజార్టీతో గెలవడం చూసి వాసుపల్లి నిజంగానే షాకయ్యారన్నది లోకల్ వాయిస్. ఆ తర్వాతనే ఆయన పార్టీలోని అత్యంత కీలకమైన వ్యవస్థని టార్గెట్ చేస్తూ మాట్లాడటం యాధృచ్ఛికం కాకపోవచ్చని అంచనా వేస్తున్నారు విశ్లేషకులు. 2019లో టీడీపీ నుంచి గెలిచి ఏడాది కాలానికే జెండా పీకేశారు ఈ మత్స్యకార నేత. వైసీపీ అధినాయకత్వం సాదరంగా స్వాగతించినప్పటికీ నియోజకవర్గ రాజకీయాలు కంట్లో నలుసుగా మారాయట. అప్పటి వైసీపీ నేత, బ్రాహ్మణ కార్పొరే షన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ వర్సెస్ వాసుపల్లిగా వ్యవహారం నడిచేది. అప్పటి పార్టీ ముఖ్యనేత విజయ సాయిరెడ్డి ప్రమేయంతోనే తాను ఇబ్బంది పడాల్సి వచ్చిందన్న అభిప్రాయం ఆయనలో ఉందట. ఇక ఎన్నికలకు ముందు సుధాకర్ పార్టీ మారిపోయి దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ అయ్యారు. ఇక దక్షిణ నియోజకవర్గం వైసీపీలో తనకు ఇబ్బంది లేదనుకుంటున్న టైంలో చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు పార్టీలో కలకలం రేపుతున్నాయి. ఇప్పుడు ఆయన స్వరం ఎందుకు మారిందన్న చర్చలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో అధికారం మారిన వెంటనే ఆయన తిరిగి కూటమికి దగ్గరవుతారని అనుకున్నారు అంతా. గణేష్ కుమార్ మాత్రం ప్రాణం వున్నంత వరకు వైసీపీలోనే నని తేల్చేశారు. అలాంటప్పుడు ఈ అసంతృప్త స్వరం ఎందుకంటే? అందుకు వేరే బలమైన కారణాలున్నాయన్న విశ్లేషణలు నడుస్తున్నాయి. విశాఖ దక్షిణంలో బలపడేందుకు మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్ కుటుంబం ప్రయత్నం చేస్తోందట. అలాగే? ఒకరిద్దరు మాజీ ఎమ్మెల్యేలు కూడా యాక్టివేట్ అవుతున్నట్టు సమాచారం. వాళ్ళకు పార్టీలోని సీనియర్లు సహకరిస్తున్నారన్న అనుమానమే ఆయన అసహనానికి కారణం కావచ్చంటున్నారు. అందుకే కో ఆర్డినేటర్ వ్యవస్థను కూడా ప్రశ్నిస్తుండవచ్చన్నది ఓ వాదన. మొత్తం మీద వైసీపీలోని అత్యంత కీలకమైన వ్యవస్థ టార్గెట్‌గా వాసుపల్లి సంధించిన అసంతృప్తి అస్త్రం ఎన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.

## ఏడాది సంబురాల్లో కనిపించని కమలం

విజయవాడ, జూన్ 17, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయింది. ఈ ఏడాది కాలంలో జరిగిన పాలనపై రాష్ట్ర ప్రభుత్వం సంబరాలకు సిద్ధమైంది. ప్రధానంగా ప్రజలను కలుసుకోవడం ప్రజల సంతృప్తిని లెక్క వేసుకోవడం వారికి అనుకూలంగా మళ్లీ కార్యక్రమాలు నిర్వహించడం అనేది రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం. అయితే కూటమి పార్టీలుగా విజయం దక్కించుకున్న వాటిలో బీజేపీ కీలకమైంది. కేంద్రంలో ఈరోజు మోడీ ప్రభుత్వం ఏర్పడడానికి రాష్ట్రంలో ఏర్పడిన చంద్రబాబు ప్రభుత్వం అత్యంత ముఖ్యమైనది. ఇది అందరికీ తెలిసిందే.ఇలాంటి సమయంలో కేంద్రంలో కూటమి ప్రభుత్వాన్ని బలపరుస్తున్న చంద్రబాబుకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని బలపరచాలన్నటువంటి ఆలోచన బిజెపికి రాకపోవడం చాలా శోచనీయం. ఎందుకంటే రాష్ట్రంలో ప్రభుత్వం ఏడాదిపాలనపై కార్యక్రమాలను నిర్వహిస్తున్నా.. బిజెపి నాయకులు ఎక్కడా కనిపించడం లేదు. ముఖ్యంగా తల్లికి వందనం వంటి పథకాన్ని అమలు చేసినప్పుడు కూడా దీనిపై ఒక్కరంటే ఒక్కరు కూడా స్పందించలేదు. దీనివల్ల అనేకమంది మహిళలకు లబ్ధి జరుగుతోందని ఒక ప్రెస్ మీట్ గాని ఒక ప్రకటన గాని విడుదల చేయలేదు.అలాగే పింఛన్ల పెంపు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి వాటిపై కూటమీ పాలకులు ఒకవైపు ప్రకటనలు చేస్తున్న బిజెపి పక్షాన ఎవరు నోరు ఎత్తటం లేదు. మరి దీన్ని ఎలా చూడాలి? ఏ విధంగా అర్థం చేసుకోవాలి అంటే రేపు ఏదైనా ప్రజల్లో అసంతృప్తి రగిలి అసంతృప్తి కారణంగా విమర్శలు చేస్తే మా తప్పులేదు అని తప్పించుకునే దారి బిజెపిలో కనిపిస్తోందా? లేకపోతే రేపు రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తే దానికి మాకు సంబంధం లేదు మేము నిమిత్త మాత్రులం అని తప్పించుకునే దారి కనిపిస్తోందా అంటే అవునని అంటున్నారు పరిశీలకులు.కూటమి ప్రభుత్వంలో ఏం చేసినా అది మూడు పార్టీలకు వర్తిస్తుంది. రేపు ఓట్లు అడిగే విధానాన్ని పరిశీలిస్తే మూడు పార్టీల పరంగానే ప్రజల్లోకి వెళ్లాలి. మూడు పార్టీల పరంగానే ప్రజలను ఓట్లు అభ్యర్థించాలి. ఈ విషయంలో బిజెపి నాయకులు అనుసరిస్తున్న ధోరణి ప్రధానంగా చర్చగా మారింది. ఇది సరికాదని ప్రజల్లోకి రావాలనేది కూటమి పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు సూచిస్తున్నారు. నిజానికిగత ఎన్నికల్లో విజయంఉన్నా వచ్చే ఎన్నికల నాటికి ఈ ఐదేళ్ల పాలనను చూసి మాత్రమే ప్రజలు ఓటేస్తారు తప్ప జగన్ పై విమర్శలు చేయడం ద్వారా ఓట్లు ఎంతవరకు పడతాయి అనేది చూడాలి.కాబట్టి మళ్ళీ ఎన్నికల్లో విజయం దక్కించుకోవాలన్నా.. మళ్లీ ఎన్నికల్లో మెజారిటీ ఓట్లు సాధించాలన్నా కూడా అందరూ కలిసికట్టుగా సంయుక్తంగా ప్రజల మధ్య ఉండడం ప్రజల సమస్యలు పట్టించుకోవడం ముఖ్యం. సంతృప్తిని కూడా అంచనా వేసుకోవడం వంటివి బిజెపి నాయకులు కూడా చేయాల్సిన అవసరం ఉందనేది పరిశీలకులు చెబుతున్న మాట. మరి కమల నాథులు ఏమంటారో చూడాలి.

# అక్కా చెల్లెళ్ల మధ్య పెరిగిన దూరం



కర్నూలు, జూన్ 17,ప్రముఖ రాజకీయ కుటుంబానికి చెందిన ఆ అక్కచెల్లెళ్ళ మధ్య ఏదో జరుగుతోందా? ఇబ్బంది వచ్చినప్పుడు కూడా కనీసం ఒకర్ని ఒకరు పరామర్శించుకోలేనంత అగాథం పెరిగిపోయిందా? సినిమా, రాజకీయం కలగలిసిపోయినట్టుగా ఉండే ఆ సిస్టర్స్ ఎవరు? వాళ్ళ మధ్య సఖ్యత లేదన్న అనుమానాలు ఇప్పుడెందుకు వచ్చాయి? నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, మాజీ మంత్రి భూమా అఖిలప్రియను వివాదాలు చుట్టుముడతాయో? లేక ఆమే వివాదాలను వెతుక్కుంటూ వెళ్తారో తెలీదుగానీ? ఎప్పుడూ ఏదోఒక వివాదాస్పద టాపిక్‌తో చర్చల్లో వుంటున్నారు ఆమె. ఆ పరంపరలోనే? తాజాగా వివాదం ఆమె ఖాతాలో పడింది. కాకుంటే? ఈసారి ఇది మరింత తీవ్రమైనది, రక్త సంబంధానికి సంబంధించినదని చెప్పుకుంటున్నారు నియోజకవర్గంలో. దొర్నిపాడు మండలం డబ్ల్యూ గోవిందిన్నెలో జరిగిన ఓ కార్యక్రమానికి వెళ్ళారు అఖిల. అక్కడే? అనుకోకుండా స్పృహ తప్పి పడిపోయారామె. గోవిందిన్నెలో మూలపెద్దమ్మ దేవర గండ దీపం మోశాక స్పృహ తప్పి పడిపోయారు ఎమ్మెల్యే. ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేసి నంద్యాల ఆసుపత్రికి తరలించారు. మరుసటి రోజు వరకు అన్ని పరీక్షలు చేయించుకొని ఎలాంటి అనారోగ్యం లేదని నిర్ధారించుకున్న తర్వాత డిశ్చార్జ్ అయ్యారామె. అటు మూల పెద్దమ్మ దేవర ఉత్సవాలకు అఖిలప్రియ సొంత చెల్లెలు మౌనిక, ఆమె భర్త మంచు మనోజ్ కూడా వచ్చారు. అఖిల పెదనాన్న భూమా బ్రహ్మానంద రెడ్డి ఆహ్వానం మేరకు వాళ్ళు కూడా ఉత్సవాలకు హాజరయ్యారట. కానీ? బ్రహ్మానంద రెడ్డి ఇంటికి అఖిలప్రియ వెళ్ళలేదు. అది వేరే సంగతి. ఇక అఖిల స్పృహ తప్పి పడిపోయిన సమయంలో మౌనిక దంపతులు కూడా అదే ఊళ్ళో ఉన్నారట. కానీ? వాళ్ళు అదేమీ పట్టించుకోకుండా? అమ్మవారి దర్శనం చేసుకొని వెళ్లిపోయారు. అఖిల స్పృహ తప్పి పడిపోయి ఒక రోజంతా ఆసుపత్రిలో వున్నా? సొంత చెల్లి దంపతులు పరామర్శించక పోవడం చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే అఖిలను మంత్రి ఫరూక్, ఇతర ముఖ్య నేతలు, ఆళ్లగడ్డ టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అయినాసరే?. ఘటన జరిగినప్పుడు అక్కడికి దగ్గర్లోనే ఉన్న సొంత చెల్లి మౌనిక పరామర్శించకపోవడం ఏంటన్నది ప్రస్తుతం నంద్యాల పొలిటికల్ సర్కిల్స్‌లో బిగ్ క్వశ్చన్.ఆ మధ్య జరిగిన దివంగత భూమా శోభానాగిరెడ్డి వర్ధంతి కార్యక్రమానికి మౌనిక, మంచు మనోజ్ వెళ్లిన సందర్భంలోనూ అక్కచెల్లెళ్ళ మధ్య మాటలు లేవు. కేవలం భూమా ఘాట్ కు వెళ్లి నివాళులు అర్పించి అటు నుంచి ఆటే వెళ్లిపోయారు మౌనిక దంపతులు. అప్పుడు అఖిలప్రియ ఇంటికి వెళ్ళలేదట. రెండేళ్ల క్రితం కూడా ఇలాగే భూమా ఘాట్‌కు వెళ్లి అఖిలను కలవకుండానే మౌనిక దంపతులు వెళ్లిపోయారు. వాటన్నిటిని ఇప్పుడు జరిగిన తాజా ఎపిసోడ్‌తో పోల్చి చూసుకుంటున్నవాళ్ళు?. భూమా సిస్టర్స్ మధ్య సత్సంబంధాలు లేవా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారట. కొన్నేళ్లుగా ఇద్దరూ కలిసిన సందర్భాలు కూడా లేవట. దీంతో గ్యాప్ గట్టిగా ఉందనే ప్రచారం ఊపందుకుంది. వాస్తవంగా? భూమా కుటుంబానికి సంబంధించి ఇది వ్యక్తిగత విషయమే అయినా? రాజకీయ, సినీ రంగంతో ఉన్న సంబంధాల కారణంగా చర్చనీయాంశం అవుతోంది. అటు తనను పరామర్శించకుండానే మౌనిక, మనోజ్ దంపతులు వెళ్లిపోవడంపై అఖిలప్రియ కూడా ఆసక్తికర వ్యాఖ్యలు కూడా చేశారు. నేను కళ్ళు తిరిగి పడిపోయి హాస్పిటల్ లో ఉంటే? ఆ విషయం వదిలేసి పరామర్శలకు ఎవరు వచ్చారు, ఎవరు రాలేదని మాట్లాడుకోవడం కరెక్ట్ కాదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారామె. చెల్లెలు తర్వాత ఫోన్లో అయినా పరామర్శించిందా అన్న విషయంలో మాత్రం క్లారిటీ ఇవ్వడం లేదు ఎమ్మెల్యే. ఈ విషయంలో మౌనిక వైపు వాదన మరోలా ఉందట. అఖిల ఆసుత్రిలో చేరే సమయానికి తాము అక్కడి నుంచి వచ్చేశామని, ఆమె పడిపోయిన విషయం తమకు తెలియదని మంచు మనోజ్ వ్యక్తిగత సిబ్బంది చెబుతున్నట్టు సమాచారం. మొత్తమ్మీద ఎమ్మెల్యే భూమా అఖిల అనారోగ్యం ప్రస్తుతం పొలిటికల్ కలర్ పులుముకుంటోంది. అక్క చెల్లెళ్ళ మధ్య ఏదో ఉందని ఊహాగానాలు పెరుగుతున్న క్రమంలో అలాంటిదేం లేదని ఇద్దరూ ఖండించకపోవడాన్ని ప్రత్యేకంగానే చూడాలంటున్నారు.

## పహల్గమ్ లో పెరుగుతున్న రద్దీ

శ్రీనగర్, జూన్ 17, జమ్మూ కశ్మీర్‌లోని పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తరువాత అక్కడి పర్యాటక ప్రదేశాలన్నీ మూతపడ్డాయి. భద్రతా చర్యల కారణంగా మూసివేసిన పర్యాటక ప్రాంతాలను జమ్మూకశ్మీర్ ప్రభుత్వం మళ్లీ తెరిచింది. దాదాపు రెండు నెలల తర్వాత పహల్‌గామ్ పరిసర ప్రాంతాల్లో పర్యాటకుల రద్దీ కనిపిస్తోంది. రహదారులపై వాహనాలు తిరుగుతున్నాయి. మార్గమధ్యంలో ప్రజలు ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సెల్ఫీలు దిగుతున్నారు. పహల్గాంతో సహా చుట్టు పక్కల ప్రాంతాలకు పర్యాటకుల తాకిడి పెరిగింది. పర్యాటకుల రద్దీతో పలు చోట్ల వాహనాల రద్దీ ఏర్పడింది. పర్యాటక శాఖ పునరుద్ధరణకు చర్యలు వేగవంతం చేసింది. జమ్మూ-కశ్మీర్‌లో ఎలాంటి వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ ఎప్పుడూ పర్యాటకులతో రద్దీగా ఉండేది. అక్కడి స్థానికులు దాదాపు టూరిజం మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. కానీ, ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రవాద దాడి కాశ్మీర్ లోయలోని పర్యాటక రంగాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. గతంలో మాదిరిగా ప్రస్తుతం పర్యాటకుల రావడంలేదని స్థానికులు చెబుతున్నారు.

## అనవసర రాద్ధాంతంతో వైసీపీ

విజయవాడ, జూన్ 17, ఇంటిలో తిరుగుతున్న ఫ్యాన్ కు బేరింగులు బాగుంటేనే దాని నుంచి నలుదిక్కులా గాలి వస్తుంది. శబ్దం లేకుండా ఫ్యాన్ ఆహ్లాదాన్ని అందిస్తుంది. రాత్రి వేళ సుఖమయ నిద్రను అందిస్తుంది. ఫ్యాన్ లోని ఇతరత్రా పరికరాల కంటే బేరింగులే కీలక భూమిక పోషిస్తాయి. అలాంటి ఫ్యాన్ ను పట్టుకుని ఎన్నికల ప్రచారంలో వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఫ్యాన్ ఇంటిలో ఉండాలి.. టీడీపీ గుర్తు సైకిల్ ఇంటి బయట ఉండాలి, ఇక జనసేన గుర్తు గ్లాసు సింకులో ఉండాలంటూ రిథమిక్ డైలాగులు చెప్పిన విషయం గుర్తుండే ఉంటుంది. అయితే ఇప్పుడు వైసీపీ పరిస్థితి చూస్తే? ఆ పార్టీ గుర్తు ఫ్యాన్ కే బేరింగులు పూర్తిగా పాడైపోయాయని చెప్పక తప్పదు.ఇక అసలు విషయంలోకి వస్తే? జగన్ అమలు చేసిన అమ్మ ఒడి మాదిరిగానే కూటమి సర్కారు ఇటీవలే తల్లికి వందనం పేరిట కార్యక్రమాన్ని ప్రారంబించింది. ఈ పథకంపై ఆది నుంచి కూడా తనదైన శైలి విమర్శలు గుప్పిస్తూ వస్తున్న వైసీపి ఎక్కడికక్కడ కూటమి పార్టీలను ప్రత్యేకించి టీడీపీని ఎద్దేవా చేసేందుకు వైసీపీ నేతలు చేయని యత్నం లేదంటే అతిశయోక్తి కాదు. ఈ విమర్శలన్నింటినీ తట్టుకుని మరీ కూటమి సర్కారు తల్లికి వందనాన్ని ఘనంగా ప్రారంభించింది. ముందుగా చెప్పినట్టుగా ఇంటిలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామన్న కూటమి మాట తప్పలేదు. ఫలితంగా ఒక్కో ఇంటిలో ఐదుగురు, ఆరుగురు, కొన్ని కుటుంబాల్లో అయితే ఏకంగా 12 మంది పిల్లలకూ ఈ పథకం అందింది.అయితే పథకం ప్రారంభం అయిన వెంటనే ఈ పథకం అమలు తీరుపై వైసీపీ తనదైన శైలి విమర్శలు గుప్పించడం మొదలు పెట్టింది. తల్లికి వందనం రూ.15 వేల అని చెప్పి రూ.13 వేలు మాత్రమే ఇచ్చారన్న వైసీపీ?మిగిలిన రూ.2 వేలు లోకేశ్ ట్యాక్స్ కింద లోకేశ్ ఖాతాలకు మళ్లాయని ఆరోపించింది. ఈ ఆరోపణలపై టీడీపీ చాలా వేగంగా రియాక్ట్ అయ్యింది. అమ్మ ఒడిలో మీరు కూడా రూ.2 వేలు కట్ చేశారు కదా..మరి నాడు జగన్ ఖాతాలోకి వెళ్లాయా? అని ప్రశ్నించిన టీడీపీ? లోకేశ్ ఖాతాలోకి రూ.2 వేలు చేరినట్లుగా నిరూపించాలని డిమాండ్ చేసింది.

# ఇప్పుడు కాకపోతే ఎప్పుడంటున్న జనసేన ఎమ్మెల్యేలు

ఏలూరు, జూన్ 17, 24 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తిరుగులేని ఆధిపత్యాన్ని చూపించింది జనసేన. జిల్లాలోని ఆరు సీట్లలో పోటీ చేసి అన్ని చోట్ల విజయం సాధించి కంచుకోటగా నిలబడింది. అలాంటి జిల్లాలో పార్టీ అధినేత ఆశించిందొకటి.. ఎమ్మెల్యేలు చేస్తున్నదొకటి అన్నట్టుగా తయారైందట పరిస్థితి. ఇక్కడి నుంచి తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన జనసేన నేతలు.. మళ్ళీ అవకాశం వస్తుందో లేదో? భవిష్యత్తు సంగతి మనకెందుకు, దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకుందామన్నట్టు ఆత్రంగా వ్యవహరిస్తున్నారట. గీత దాటుతూ? ఇప్పుడు కాకుంటే ఇంకెపుడు అన్నట్టుగా చేస్తున్న పనులు చూసి జనసేన నేతలే అవాక్కవుతున్నట్టు చెప్పుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి తొలిసారి అసెంబ్లీకి వెళ్ళిన వారిలో నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఉంగుటూరు శాసనసభ్యుడు పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు. ఇక సీనియర్ నాయకుల లిస్టులో భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, నిడదవోలు ఎమ్మెల్యే కమ్ మంత్రి కందుల దుర్గేష్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఉన్నారు.సీనియర్ల సంగతి పక్కనపెడితే పోలవరం, నర్సాపురం, ఉంగుటూరు ఎమ్మెల్యేల అనుచరులు మాత్రం దున్నేస్తున్నారన్న టాక్ ఉంది జిల్లాలో. ఏ పనిచేయాలన్నా, ఏ కాంట్రాక్ట్ దక్కించుకోవాలన్నా, మద్యం వ్యాపారం చేయాలన్నా? షాడోలుగా మారిన ఎమ్మెల్యేల అనుచరగణానికి భారీగా ముడుపులు చెల్లించుకోవాల్సి వస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. మంచా చెడా అన్నదాంతో సంబంధం లేదు. పని ఏదైనా సరే?? ఫిక్స్ చేసిన పర్సంటేజ్ ముట్టజెపితే చాలు?. పూర్తి స్థాయిలో సహకరిస్తారట. ఆయా నియోజకవర్గాల్లో ఇది ఓపెన్ టాక్ అంటున్నారు. నరసాపురంలో ఓఎం బొమ్మిడి నాయకర్ సోదరుడితో సహా మరికొంత మంది నేతలు ప్రతి పనికీ? ఓ రేటు ఫిక్స్ చేస్తున్నారన్న ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఇటీవల సివిల్ తగాదాల్లో సైతం ఎమ్మెల్యే మనుషులు తలదూర్చి సెటిల్మెంట్స్ చేయడం వివాదాస్పదమవుతున్నట్టు చెబుతున్నారు. నరసాపురం నియోజకవర్గంలో ఏ వ్యాపారం మొదలుపెట్టాలన్నా? ముందు నాయకర్‌కు కావాల్సిన వాళ్ళని కలిస్తేనే? పనవుతుందని, వాళ్ళకు సమర్పించుకోకుంటే? ఏ పనీ చేయలేరన్న ప్రచారం జోరుగా ఉంది. మట్టి తవ్వకాల విషయంలో జనసేన నేతల ఆగడాలపై? మిత్రపక్షం టీడీపీ నాయకులే ఫిర్యాదు చేసేవరకు వెళ్ళిందంటే? పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నది లోకల్ వాయిస్. ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు, తమ సామాజికవర్గానికి చెందిన వారితో సెటిల్మెంట్స్‌లాంటి ఆరోపణలు పెరుగుతున్నాయి. తొలిసారి ఎమ్మెల్యే అయిన నాయకర్ సలహాదారులు, సెటిల్మెంట్ చేసే బ్యాచ్‌తో పెద్ద కోటరీనే ఏర్పాటు చేసుకున్నారని జనసేన నేతలే గుసగుసలాడుకుంటున్నారట.

ఇక పోలవరం విషయంలోనూ ఇదే పరిస్థితి.ఎమ్మెల్యే మనుషులమంటూ కొంతమంది అక్రమాలకు తెరలేపడంతో నియోజకవర్గంలో చులకన భావం ఏర్పడుతోందని తెగమధన పడిపోతున్నారట తెలుగు తమ్ముళ్ళు. జనసేన ఎమ్మెల్యే పనులు తమకు తలవంపులు తెస్తున్నాయన్నది వాళ్ళ వాదనగా తెలుస్తోంది. మొత్తం ఏడు మండలాల్లో ఎమ్మెల్యే షాడోస్‌ని పెట్టుకుని బీభత్సంగా వసూళ్ళకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు పెరుగుతున్నాయి. అయితే కొన్ని విషయాలపై ఎమ్మెల్యేకు అవగాహన తక్కువ ఉందని భావిస్తున్న కొందరు చోటామోటా నేతలు ఆయన దృష్టికి తీసుకురాకుండానే పర్సనల్‌గా పనులు చక్కబెట్టుకుంటూ? అందినకాడికి దోచుకుంటున్నారట. అటు ఉంగుటూరు నియోజకరర్గంలోనూ ఇదే పరిస్థితి ఉన్నట్టు చెప్పుకుంటున్నారు.తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన పత్సమట్ల ధర్మరాజు చుట్టూ చేరిన ఆయన సొంత సామాజికవర్గ నేతలు?. పోలీసులు, ఇతర అధికార యంత్రాంగాన్ని చేతిలో పెట్టుకుని అక్రమ చేపల చెరువులు నిర్వహిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఏడాది గడిచినా ఎమ్మెల్యేలకు కొన్ని శాఖలపై పట్టు రాకపోవడం? షాడోలకు వరంగా మారిందని, ఎమ్మెల్యేల పేరుతో వాళ్ళే ఆదేశాలిస్తూ?. తమ పబ్బం గడుపుకుంటున్నట్టు చెప్పుకుంటున్నారు. తీరా అవినీతి ఆరోపణలు వచ్చేసరికి ఆ నిందలన్నీ ఎమ్మెల్యేలపై పడుతున్నాయట. ఈ విషయంలో తెలిసి కూడా వాళ్ళేమీ చేయలేకపోతున్నట్టు ప్రచారం జరుగుతోంది. డ్యామేజ్ జరిగిపోతున్నా? నాయకులు సీరియస్ యాక్షన్ తీసుకోకపోవడానికి కారణాలు అనేకం ఉన్నట్టు తెలుస్తోంది. తాము పట్టుకోల్పోతే? ఆ స్థానంలో టిడిపి నేతలు ఎక్కడ అజమాయిషీ చెలాయిస్తారోనన్న భయం ఉందని, అందుకే? ఏదైతేనేం? నడిచేదేదో నడవనీ? మనది మనకి వస్తోంది కదా అనుకుంటున్నట్టు సమాచారం. కానీ? ఆ ఉదాసీనతవల్ల పార్టీకి చెడ్డపేరు వస్తున్నట్టు ఫీలవుతోంది కేడర్. ఈ డ్యామేజ్ కంట్రోల్‌కి హైకమాండ్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి మరి.


# ఆవు పాలు, గేదె పాలు ఏవి మంచిదో తెలుసా...?



ఆవు పాలు మరియు గేదె పాలు రెండూ తమదైన ప్రత్యేకతలు కలిగి ఉంటాయి. ఏది మంచిది అనే ప్రశ్నకు సమాధానం చెప్పడం కొంచెం కష్టమే. వ్యక్తిగత అవసరాలు, ఆరోగ్య పరిస్థితి మరియు ఇష్టాలపై ఆధారపడి ఉంటుంది.ఆవు పాల లాభాలు:ఎముకలు మరియు దంతాల ఆరోగ్యానికి కాల్షియం చాలా ముఖ్యం. ఆవు పాలు కాల్షియం యొక్క అద్భుతమైన మూలం.శరీరం కణాల నిర్మాణానికి మరియు మరమ్మతుకు ప్రోటీన్ అవసరం. పాలు ప్రోటీన్ యొక్క మంచి మూలం.విటమిన్ డి, బి12, పొటాషియం వంటి అనేక ముఖ్యమైన విటమిన్లు మరియు ఖనిజాలు ఆవు పాలలో లభిస్తాయి.కొన్ని అధ్యయనాల ప్రకారం, పాలు తాగడం బరువు తగ్గడానికి సహాయపడుతుంది.పాలలో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది." జున్ను పాలు తాగుతున్నారా..?"ఆవు పాల నష్టాలు:కొంతమందికి ల్యాక్టోస్ అనే చక్కెరను జీర్ణించుకోవడంలో ఇబ్బంది ఉంటుంది. ఇలాంటి వారికి పాలు తాగడం వల్ల అజీర్తి, వాయువు, అతిసారం వంటి సమస్యలు వస్తాయి.పూర్తి కొవ్వు పాలలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటుంది. ఇది హృదయ వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది.కొన్ని పాలలో గర్భధారణ హార్మోన్లు ఉంటాయి. ఇవి కొన్ని ఆరోగ్య సమస్యలకు కారణం కావచ్చు.కొంతమందికి పాల ప్రోటీన్లకు అలర్జీ ఉంటుంది.గేదె పాల లాభాలు మరియు నష్టాలుగేదె పాలు పోషకాలతో నిండి ఉన్నాయి మరియు వేలాది సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా వినియోగించబడుతున్నాయి. అయితే, ఇతర పాల వలె, గేదె పాలకు కూడా కొన్ని లాభాలు మరియు నష్టాలు ఉన్నాయి.గేదె పాల లాభాలు:గేదె పాలలో కాల్షియం, ప్రోటీన్, విటమిన్లు మరియు ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యం, కండరాల అభివృద్ధి మరియు మొత్తం శరీర పనితీరుకు అవసరం. గేదె పాలలో ఉండే యాంటీబాడీలు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడతాయి.గేదె పాలలోని ప్రోబయోటిక్స్ జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి మరియు కడుపు సంబంధిత సమస్యలను తగ్గిస్తాయి.గేదె పాలలోని ప్రోటీన్ శరీరాన్ని ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది, ఇది బరువు నిర్వహణకు సహాయపడుతుంది.

# ఖాళీ కడుపుతో జీలకర్ర నీళ్లు తాగితే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు..

వి జీలకర్ర నీళ్లు అనేది అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉండే సహజ వైద్య పద్ధతి. జీలకర్రలో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండటం వల్ల ఇది శరీరానికి మేలు చేస్తుంది. జీలకర్రని నీటిలో నానబెట్టడం ద్వారా వాటి పోషకాలు నీటిలో కలుస్తాయి, దీన్ని ఉదయం ఖాళీ కడుపుతో తాగడం ద్వారా మంచి ప్రయోజనాలను పొందవచ్చు. జీలకర్ర నీళ్లు తాగితే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు: జీర్ణశక్తి మెరుగుదల: జీలకర్ర నీళ్లు



జీర్ణ వ్యవస్థకు సహాయపడుతుంది. ఇందులో ఉండే థైమోల్ అనే పదార్థం జీర్ణరసాల ఉత్పత్తిని మెరుగుపరుస్తుంది, దీని వల్ల గ్యాస్ సమస్య, మలబద్ధకం మరియు మానసిక ఒత్తిడి తగ్గుతుంది. "నిత్యం యవ్వనంగా, అందంగా ఉండాలంటే ఇవి గుప్పెడు తినండి" బరువు తగ్గడం: జీలకర్ర నీళ్లు బరువు తగ్గడంలో సహాయపడే ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. ఇది శరీరంలోని వ్యర్థాలను తొలగించడంలో సహాయపడుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో తాగడం ద్వారా మెటాబాలిజం వేగంగా పనిచేస్తుంది, ఇది కొవ్వు కరుగుదలలో సహాయపడుతుంది. యాంటీ ఆక్సిడెంట్ల సమృద్ధి: "పరగడుపున నిమ్మరసం తేనె తాగుతున్నారా? ఒక్కక్షణం ఆగండి!" జీలకర్రలో యాంటీ ఆక్సిడెంట్లు మరియు విటమిన్ ఇ ఉంటాయి, ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ని నాశనం చేస్తాయి. దీని వల్ల చర్మం కాంతివంతంగా, ఆరోగ్యంగా ఉండటానికి సహాయపడుతుంది. ఇన్ఫెక్షన్ల నివారణ: జీలకర్రలో యాంటీ మైక్రోబియల్ , యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. దీన్ని రోజూ తాగడం ద్వారా శరీరంలో ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు. ముఖ్యంగా గుండెకు, లివర్‌కు రక్షణ కల్పిస్తుంది. "చీర బిగుతుగా కట్టుకునే మహిళలకు షాకింగ్ న్యూస్!" ఇమ్యూనిటీ పెంపు: జీలకర్రలో ఐరన్, విటమిన్ సి ఉంటాయి, ఇవి రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఇది శరీరాన్ని ఇన్‌ఫెక్షన్ల నుండి కాపాడుతుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. మొదలైన ఏపీ బడ్జెట్ సమావేశాలు.. ప్రాధాన్యతా రంగాలకు భారీ కేటాయింపులు ।  చర్మానికి , జుట్టుకు మేలు: జీలకర్రలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలు చర్మం మరియు జుట్టు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. జీలకర్ర నీళ్లు తాగడం వల్ల చర్మం మెరుస్తూ ఆరోగ్యంగా మారుతుంది, జుట్టు ముడతలు రాకుండా ఆరోగ్యంగా పెరుగుతుంది. మధుమేహ నియంత్రణ: జీలకర్ర నీళ్లు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచడానికి సహాయపడుతుంది. ఇది మధుమేహంతో బాధపడుతున్న వారికి సహాయపడవచ్చు. జీలకర్ర నీళ్లను ఎలా తాగాలి: జీలకర్ర నీళ్లను తయారు చేయడం చాలా సులభం. 1 టీస్పూన్ జీలకర్రను 1 గ్లాసు నీటిలో రాత్రి నానబెట్టాలి. ఉదయం ఆ నీటిని వడకట్టి ఖాళీ కడుపుతో తాగాలి. ఈ విధంగా తాగడం వల్ల మీరు ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. జీలకర్ర నీళ్లను మితంగా మాత్రమే తీసుకోవాలి. రోజూ తాగడమే కాకుండా వైద్యుల సూచనలను కూడా అనుసరించాలి.

# కొబ్బరి నీళ్లలో కొద్దిగా ఉప్పు కలిపి తాగితే శరీరానికి ఏమవుతుందో తెలుసా?

కొబ్బరి నీరు ప్రకృతిద్వారా అందించిన ఒక శుద్ధమైన, ఆరోగ్యకరమైన పానీయం. ఇది సహజసిద్ధమైన ఎలక్ట్రోలైట్స్, విటమిన్లు, ఖనిజాలు కలిగిన పానీయం కావడంతో ఆరోగ్యానికి చాలా మంచిది. కొబ్బరి నీరులో కొద్దిగా ఉప్పు కలిపి తాగడం కూడా ఆరోగ్యపరంగా కొన్ని ప్రయోజనాలు కలిగి ఉంటుంది, కానీ కొన్నిసార్లు దానికి ప్రతికూల ఫలితాలు కూడా కలగవచ్చు. ప్రయోజనాలు: హైడ్రేషన్: కొబ్బరి నీరులో సహజసిద్ధమైన ఎలక్ట్రోలైట్స్ ఉండటం వల్ల ఇది శరీరాన్ని తక్షణమే హైడ్రేట్ చేస్తుంది. కొద్దిగా ఉప్పు కలపడం వల్ల శరీరం మరింత సమర్థవంతంగా నీటిని గ్రహిస్తుంది. ఇది



వ్యాయామం తరువాత లేదా గరిష్ట వేడిలో బయట ఉన్నప్పుడు శరీరంలో తేమను తిరిగి పొందడంలో సహాయపడుతుంది. "ఖాళీ కడుపుతో కరివేపాకు తింటే కలిగే అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు ఇవే!" ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్: కొబ్బరి నీరులో ఉన్న పొటాషియం, సోడియం వంటి ఎలక్ట్రోలైట్స్ శరీరంలో సోడియం స్థాయిలను సమతుల్యం చేయడంలో సహాయపడతాయి. కొద్దిగా ఉప్పు కలపడం ద్వారా సోడియం స్థాయిని మరింత పెంచుకోవడం సాధ్యమవుతుంది, ఇది నీటిని తక్కువగా విడిచిపెట్టేలా చేయడంలో సహకరిస్తుంది. ఎసిడిటీ తగ్గించడం: "అందం కోసం ముల్తానీ మట్టిని ముఖానికి అప్లై చేస్తున్నారా? ఒక్కసారి ఈ విషయాలు తెలుసుకోండి." కొబ్బరి నీరు త్రాగడం వల్ల ఆమ్లాన్ని తగ్గిస్తుంది. కొద్దిగా ఉప్పు కలపడం వల్ల ఇది మరింత సమర్థవంతంగా పని చేస్తుంది. ఇది గ్యాస్ట్రిక్ సమస్యలను తగ్గించడంలో సహకరిస్తుంది. జీర్ణ ప్రక్రియకు సహాయం: కొబ్బరి నీరు సహజంగా తేలికగా ఉండి జీర్ణ ప్రక్రియను సులభతరం చేస్తుంది. కొద్దిగా ఉప్పు కలపడం ద్వారా జీర్ణక్రియను పెంపొందించుకోవచ్చు, ఇది ఆహారాన్ని సరిగ్గా జీర్ణం చేయడంలో సహాయపడుతుంది.

# ప్లాస్టిక్ టిఫిన్ బాక్స్‌ల్లో ఫుడ్ తింటున్నారా? ఎంత డేంజరో తెలుసా?

ప్లాస్టిక్ టిఫిన్ బాక్స్‌లలో ఆహారం ఉంచి తినడం ఆరోగ్యంపై కొన్ని ప్రభావాలను చూపుతుందనే ఆందోళనలు ఉన్నాయి. ఆధునిక జీవనశైలిలో ఈ బాక్స్‌లు సులభంగా అందుబాటులో ఉండడంతో, పిల్లల నుండి పెద్దల వరకు ప్రతిరోజూ వీటిని వాడుతున్నారు. అయితే, ప్లాస్టిక్ టిఫిన్ బాక్స్‌లలో ఉన్న రసాయనాలు, వేడి చేయడం వంటివి ఆరోగ్యానికి కీడు కలిగించే అవకాశముంది. ముఖ్యంగా ప్లాస్టిక్ రసాయనాలు శరీరంలో చేరి, కొన్ని సందర్భాలలో క్యాన్సర్ వంటి వ్యాధులకు కారణం కావచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి. ప్లాస్టిక్‌లో ఉండే హానికర రసాయనాలు: బిస్ఫెనాల్-ఏ (ఃఖం): కొన్ని ప్లాస్టిక్‌లు బిస్ఫెనాల్-ఏ (ఃఖం) అనే రసాయనాన్ని కలిగి ఉంటాయి, ఇది శరీరంలోకి ప్రవేశించి హార్మోన్లను అసమతుల్యంగా మార్చే ప్రమాదం ఉంది. ఃఖం వంటి రసాయనాలు ఎండోక్రైన్ వ్యవస్థకు హానికరంగా ఉంటాయి. దీర్ఘకాలంలో ఇది కేన్సర్‌కు కూడా కారణం కావచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. "చీర బిగుతుగా కట్టుకునే మహిళలకు షాకింగ్ న్యూస్!" ఫ్తాలేట్స్: ఫ్తాలేట్స్ అనే రసాయనాలు కూడా హార్మోన్లలో మార్పులు కలిగించవచ్చు. గుండె, పేగు, కేన్సర్ వంటి సమస్యలు వచ్చే అవకాశాలు ఉంటాయని పరిశోధనలు చెబుతున్నాయి. వేడి చేయడం వల్ల కలిగే సమస్యలు: ప్లాస్టిక్ టిఫిన్ బాక్స్‌లను వంట గదిలో వాడడం, లేదా మైక్రోవేవ్‌లో వేడి చేయడం వల్ల ప్లాస్టిక్‌లోని హానికర రసాయనాలు ఆహారంలోకి విడుదల కావచ్చు. ఈ రసాయనాలు శరీరంలోకి వెళ్లి తక్షణం సమస్యలు ఇవ్వకపోయినా, దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలను కలిగించే అవకాశం ఉంది. సున్నితమైన ప్లాస్టిక్: "ప్రమాదంలో మనిషి జీవితం: రోజుకు మనం ఎంత ప్లాస్టిక్ మింగుతున్నామో తెలుసా..? " ప్రథమంగా, ప్రతి ప్లాస్టిక్ ఒకేలా తయారు కాలేదు. నాణ్యమైన, ఫుడ్ గ్రేడ్ ప్లాస్టిక్‌లలో ఃఖం-ఫ్రీ టాగ్ ఉంటే, వీటిని ఉపయోగించడం మరింత సురక్షితం. కానీ, తక్కువ నాణ్యత గల ప్లాస్టిక్‌లు ఎక్కువగా వేడి చేయడం వల్ల కేన్సర్ ముప్పును పెంచుతాయని భావిస్తారు.



# అమ్మో.. ప్రెషర్ కుక్కర్‌లో వండిన ఆహారం తింటున్నారా?



ప్రెషర్ కుక్కర్‌లో వంట చేయడం, భారతీయ వంటగదుల్లో చాలా సాధారణం. ఇది తక్కువ సమయంలో ఆహారాన్ని రుచికరంగా, సమర్థవంతంగా తయారు చేయడంలో సహాయపడుతుంది. అయితే, ప్రెషర్ కుక్కర్‌లో వండిన ఆహారం ఆరోగ్యానికి ఎంతవరకు మంచిదో అనే ప్రశ్నకు సంబంధించి కొన్ని ఆరోగ్యపరమైన పాయింట్లు మరియు చర్చలు ఉన్నాయి. ప్రెషర్ కుక్కర్‌లో వండిన ఆహారంలో ప్రయోజనాలు: పోషకాల ప్రిజర్వేషన్: ప్రెషర్ కుక్కర్‌తో ఆహారాన్ని త్వరగా వండుతారు కాబట్టి ఇందులోని పోషకాలు బాగా కాపాడబడతాయి. సాధారణ వంటల్లో ఎక్కువ కాలం పైనుంచి తక్కువ ఉష్ణోగ్రతలో వండడం వల్ల అనేక పోషకాలు నశించే అవకాశం ఉంది. కానీ ప్రెషర్ కుక్కర్‌లో వండినప్పుడు తక్కువ సమయంలో ఆహారం ఉడికిపోవడంతో పోషకాలు మరింత ప్రిజర్వ్ అవుతాయి. "జినీఎజీబినీ ఔవలిబ: మీడియాకు గట్టిగా ఇచ్చిపడేసిన జొమాటో అఖా.. ఫ్యూచర్ డేటెట్ ఫుడ్‌పై క్లారిటీ" ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు: వేడి, గాలి తగలకుండా వేగంగా ఉడికించడం వల్ల విటమిన్ సి, బి విటమిన్లు, మరియు ఫైబర్ పోకుండానే ఉంటాయి. సలాడ్లు, కూరగాయలు, మరియు కాయధాన్యాలు ప్రెషర్ కుక్కర్‌లో వండినప్పుడు వాటిలోని ఖనిజాలు ఎక్కువగా కాపాడబడతాయి. సమయం మరియు ఇంధన ఆదా: "ఊఎటవతీజీఎజీట: వామ్మో బొద్దింకలు.. రెస్టారెంట్లలో దారుణ పరిస్థితులు..!" ప్రెషర్ కుక్కర్ తక్కువ సమయంలోనే ఎక్కువ ఆహారాన్ని వండే సామర్థ్యం కలిగి ఉంటుంది. ఇది గ్యాస్ లేదా విద్యుత్ పొదుపుకు కారణం అవుతుంది. ఈ విధానం వేగంగా కాయధాన్యాలు, మాంసాలు, కూరలు, వంటకాలు వండుకోవడానికి చాలా సులభమైనది. చెడు బాక్టీరియా నివారణ: ప్రెషర్ కుక్కర్ ఎక్కువ ఉష్ణోగ్రతలో వంట చేయడం వల్ల ఆహారంలో ఉండే హానికరమైన బాక్టీరియాను తక్షణం నాశనం చేస్తుంది. ఇలా చేయడం ద్వారా ఆహారం సురక్షితంగా ఉంటుందని భావించవచ్చు. "ఉదయాన్నే నానబెట్టిన గింజలు ఎందుకు తినాలి? శరీరంలో కలిగే మార్పులు ఏమిటి?" ప్రెషర్ కుక్కర్‌లో వండిన ఆహారంలో నష్టాలు: పోషక లోపం: ప్రెషర్ కుక్కర్ ఎక్కువ ఉష్ణోగ్రతను ఉపయోగించే కారణంగా కొన్నిసార్లు కొంతమేరకు పోషకాలు నశించే అవకాశం ఉంది. ముఖ్యంగా విటమిన్ సి, బి విటమిన్లు వంటివి అధిక వేడికి సున్నితంగా ఉండటంతో అవి కొంత పోవచ్చు. కార్బనేట్ ఉత్పత్తి: కొన్ని పరిశోధనల ప్రకారం, ప్రెషర్ కుక్కర్‌లో అధిక వేడిలో వండిన ఆహారంలో కార్బనేట్ అనేది ఏర్పడవచ్చు. ఈ కార్బనేట్స్ ఎక్కువగా ఉండడం ఆరోగ్యానికి హానికరం కావచ్చని అంటున్నారు, కానీ దీనిపై ఇంకా పూర్తి స్థాయి పరిశోధన అవసరం. సహజ రుచులు నశించడం: ంటలవతీబితిబవఎవనిబి కొన్ని కూరగాయలు, కాయధాన్యాలు ఉడికినపుడు వాటి సహజ రుచులు ప్రెషర్ కుక్కర్‌లో నశించవచ్చు. ఈ రసాలు పోవడం వల్ల ఆహారం యొక్క సహజ రుచులు కొంచెం తగ్గిపోవచ్చు. అధిక వేడి, ఒత్తిడితో ఆహారం పాచిపోవడం: అధిక వేడి మరియు ఒత్తిడి కారణంగా ప్రెషర్ కుక్కర్‌లో వండిన ఆహారం కొన్నిసార్లు పాచిపోవడం లేదా కఠినంగా మారిపోవచ్చు. ఉదాహరణకు, కూరగాయలు లేదా కాయధాన్యాలు ఎక్కువగా వండితే దాని ఫైబర్ కఠినతరం కావచ్చు, ఇది జీర్ణం కావడం కష్టమవుతుంది. అధిక ఒత్తిడి వల్ల పోషకాల నష్టం: కొన్ని సున్నితమైన పోషకాలు అధిక ఒత్తిడిలో ప్రిజర్వ్ చేయడం కష్టమైన పని, ఎందుకంటే అవి సులభంగా విరుగుడతాయి. ప్రెషర్ కుక్కర్‌లో వండిన ఆహారం మితంగా వాడితే ఆరోగ్యానికి మంచిదేనని చెప్పొచ్చు. అయితే, సున్నితమైన పోషకాలు, ప్రత్యేకంగా కొందరు ప్రజల ఆరోగ్య అవసరాల నిమిత్తం, మరికొన్ని వంటకాలను సన్నని వేడి మీద వండడం ఉత్తమం.



# సినిమా



## కుబేరా ప్రీఈవెంట్ వాయిదా...15కు రీషెడ్యూల్





ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల రూపొందించిన చిత్రం 'కుబేర ప్రీ రిలీజ్ ఈవెంట్ వాయిదా పడింది. అహ్మదాబాద్ విమానప్రమాదం కారణంగా వాయిదా వేశారు. ధనుష్, రష్మిక ,నాగార్జున కీలక పాత్రలో నటించారు. త్వరలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్న నేపథ్యంలో శుక్రవారం 'కుబేర' ఈవెంట్ నిర్వహించాలని టీమ్ భావించింది. గురువారం జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం దృష్ట్యా ఆ ఈవెంట్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను తిరిగి జూన్ 15న ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు చెప్పింది. ముందు అనుకున్నవిధంగానే హైదరాబాద్‌లోనే ఈ కార్యక్రమం జరగనుందని తెలిపింది. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్‌మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన వ్యక్తికి.. వీధుల్లో జీవించే ఓ అతి పేదవాడికి మధ్య జరిగే సంఘర్షణే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. ఇందులో హవాలా, మనీలాండరింగ్ తదితర అంశాలు మిళితమై ఉంటాయి. దీంట్లో నటులు ఎక్కడా కనిపించరు. కేవలం పాత్రలు మాత్రమే కనిపిస్తాయని పుస్కుర్ రామ్‌మోహన్‌రావు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో దీనిని విడుదల చేయనున్నట్లు- చెప్పారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన 'కుబేర' ఈనెల 20న విడుదల కానుంది.



## రాజాసాబ్ టీజర్ విజువల్స్ లీక్

### షేర్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక




ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్' జూన్ 16న ఈ సినిమా టీజర్ విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దీనికి లీకుల బెడద మొదలైంది. టీజర్ విజువల్ వీడియోలు కొన్ని నెట్టింట లీక్ అయ్యాయి. దీనిపై టీమ్ స్పందించింది. లీక్ కంటెంట్‌ను షేర్ చేసేవాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఎవరైనా 'రాజాసాబ్' కంటెంట్‌కు సంబంధించిన అనధికారక వీడియోలు, ఫొటోలు షేర్ చేస్తే వారి సోషల్ మీడియా అకౌంట్‌ను తక్షణమే నిలిపివేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొంది. సినిమాటిక్ అనుభూతిని అందించేందుకు చిత్రబృందం ఎంతో కష్టపడుతోందని దానికి అందరూ సహకరించాలని కోరింది.ప్రభాస్ మొదటిసారి హారర్ నేపథ్యంలో ఉన్న కథలో నటిస్తుండటంతో అందరి దృష్టి 'ది రాజాసాబ్' పైనే ఉంది. డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా ఇది విడుదల కానుంది. దీని టీజర్ జూన్ 16న రిలీజ్ చేయనున్నట్లు టీ-మ్ ఇప్పటికే ప్రకటించింది. ఈ టీజర్ రిలీజ్ కోసం ఓ భారీ ఈవెంట్‌ను ఏర్పాటు చేసినట్లు- వార్తలు వస్తున్నాయి. దీనికోసం జాతీయ మీడియాకు కూడా ఆహ్వానాలు అందినట్లు- సమాచారం. ఈ ఈవెంట్‌లో 'రాజాసాబ్' కోసం వేసిన భారీ సెట్‌ను కూడా చూపించనున్నట్లు- తెలుస్తోంది. ఇందులో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్, సంజయ్‌దత్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## జూలై18న లాక్ చేసిన హరిహరవీరమల్లు?




ఎన్నో వాయిదాల తర్వాత హరిహర వీరమల్లు సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుందని అందరూ భావించిన తరుణంలో, సిజీ వర్క్స్ పూర్తి కాకపోవడంతో సినిమాను నిరవధికంగా వాయిదా వేశారు. నిజానికి, ఈ సినిమా 12న రిలీజ్ కావాల్సి ఉంది. విజువల ఎఫెక్ట్స్ కోసం రిలీజ్ చేయడం లేదని అనౌన్స్ చేశారు. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాను వచ్చే నెల 18వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాను డైరెక్టర్ క్రిష్ మొదలుపెట్టారు, కానీ బడ్జెట్ సమస్యల కారణంగా ఆయన తప్పుకోవడంతో, నిర్మాత ఏ.ఎమ్. రత్నం కుమారుడు జ్యోతి కృష్ణ దర్శకత్వం వహించి సినిమాను పూర్తి చేశాడు. ఈ సినిమా రెండు భాగాలుగా రూపొందుతోంది. మొదటి భాగం ఇప్పుడు రిలీజ్‌కు సిద్ధమవుతోంది. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోంది.ఈ సినిమా వచ్చే నెల రిలీజ్ అయితే, ఈ నెల మొత్తం బాక్స్ ఆఫీస్ కాస్త డల్‌గానే ఉండే అవకాశం కనిపిస్తుంది. తెలంగాణ రాబిన్ హుడ్‌గా పేరున్న పండుగ సాయన్న బయోపిక్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు- గతంలో ప్రచారం జరిగింది. మొగల్ కాలంలో వారిని ఎదిరించి, దోచి, పేదలకు పంచిపెట్టాడని ప్రచారం ఉంది. ఈ పాత్రలో పవన్ కళ్యాణ్ ఒదిగిపోయాడని అంటు-న్నారు. మొత్తానికి, ఈ సినిమా రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించే వరకు నమ్మలేం. అధికారికంగా ప్రకటించినా, సినిమా రిలీజ్ అయ్యే వరకు వస్తుందా లేదా అనేది చెప్పలేని పరిస్థితి.




## కూలీలో ఉంది నేనేనా అన్న అనుమానం


### నటుడు నాగార్జున వెల్లడి





టాలీవుడ్ అగ్ర కథానాయకుడు నాగార్జున ప్రస్తుతం రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇప్పటికే 'కుబేర' విడుదలకు సిద్ధం కాగా.. మరోవైపు ఆయన నటించిన 'కూలీ' చిత్రం కూడా ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ రెండు సినిమాలకు సంబంధించి తాజాగా ఆసక్తికర విషయాలను పంచుకున్నారు నాగార్జున. ఒక ఇంటర్వ్యూలో నాగార్జున మాట్లాడుతూ.. దర్శకుడు శేఖర్ కమ్ముల అంటే తనకెంతో అభిమానమని తెలిపారు. తనతో 15 ఏళ్లుగా సినిమా చేయాలని చూస్తున్నాను. 'కుబేర'తో ఆ కల నెరవేరింది. శేఖర్ చిత్రాలు మిగతా సినిమాలకంటే చాలా భిన్నంగా ఉంటాయి. అయితే 'కుబేర' కథతో నా దగ్గరికి వచ్చినప్పుడు నేను షాక్ అయ్యాను. శేఖర్... నువ్వు నిజంగానే ఈ సినిమా చేయాలనుకుంటు న్నావా?' అని అడిగాను. అప్పుడు శేఖర్ అవును అని తెలిపాడు. 'కుబేర' కోసం శేఖర్ ఎంతో రీసెర్చ్ చేశాడు. ఈ సినిమాలో ఆయన చెప్పిన కొన్ని ఆసక్తికర విషయాలు విని నేనే షాక్ అయ్యాను. న్యాయంపై ఆయనకు బలమైన నమ్మకం ఉంది. ఏదో ఒక స్కామ్‌నో లేదా ఏ ఒక్కరినో ఆధారంగా చేసుకొని ఈ కథ రాయలేదు. సమాజంలో చూస్తున్న విషయాలనే ఇందులో చెప్పారు. పేద, ధనిక, మధ్యతరగతి కుటుంబాల్లో ఏం జరుగుతుందనే దాన్ని ఇందులో చూపించారు. తాను అనుకున్న కథను చాలా అందంగా స్క్రీన్ మీదకు తీసుకువచ్చాడని నాగార్జున చెప్పుకొచ్చారు. ఇక 'కూలీ' సినిమా విషయానికి వస్తే, ఈ చిత్రంలో నా పాత్ర కీలకంగా ఉండబోతుంది. ఈ సినిమాలో నన్ను నేను చూసుకుని షాక్ అయ్యాను. దర్శకుడు లోకేష్ కనగరాజ్ నన్ను కొత్తగా చూపించబోతున్నాడు. ఇది పూర్తిగా మాస్ ఎంటర్-టైనర్‌గా రాబోతోంది అంటూ నాగార్జున వివరించారు.

## రామ్‌చరణ్‌తో త్రివిక్రమ్ మూవీ లేనట్లేనా?





రామ్ చరణ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఒక సినిమా రూపొందే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. నిజానికి అదేమీ లేదని అర్థమయ్యేలా త్రివిక్రమ్ తరపున నిర్మాత నాగ వంశీ ఒక ట్వీట్ వేశాడు. ప్రస్తుతానికి వెంకటేష్, జూనియర్ ఎన్టీఆర్ సినిమాలను మాత్రమే త్రివిక్రమ్ ఫైనల్ చేశారని, ఆయనకు సంబంధించిన ఏ అప్‌డేట్ అయినా తాను సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తానని చెప్పాడు. అయితే, రామ్ చరణ్‌తో సినిమా ఉంటుందా, ఉండదా అనే చర్చపై అనేక వార్తలు వస్తున్నాయి. కానీ, ఇప్పట్లో రామ్ చరణ్ త్రివిక్రమ్‌తో సినిమా చేసే అవకాశం లేదు. ప్రస్తుతం రామ్ చరణ్, బుచ్చిబాబు దర్శకత్వంలో పెద్ది అనే సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమా పూర్తయిన వెంటనే సుకుమార్ దర్శకత్వంలో మరో సినిమా సైన్ చేశాడు. ఆ సినిమా పూర్తయిన తర్వాత త్రివిక్రమ్‌తో సినిమా చేయాలనుకున్నాడు, కానీ కొన్ని అంతర్గత కారణాల వల్ల ఆ సినిమాను పక్కన పెట్టేశాడు. తాజా సమాచారం ప్రకారం, రామ్ చరణ్ సుకుమార్ సినిమా పూర్తయిన వెంటనే సందీప్ రెడ్డి వంగాతో సినిమా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ సినిమా దాదాపు ఫైనల్ అయినప్పటికీ, అధికారికంగా అనౌన్స్ చేయకపోతే నిజమని చెప్పలేం. కాబట్టి, త్రివిక్రమ్-రామ్ చరణ్ సినిమా ప్రస్తుతానికి ఆగిపోయింది. భవిష్యత్తులో ఉండొచ్చు లేదా ఉండకపోవచ్చు. త్రివిక్రమ్ చెప్పిన కథ రామ్ చరణ్‌కు నచ్చినప్పటికీ, అంతర్గత కారణాల వల్ల ఆ సినిమాను పక్కన పెట్టినట్లు- తెలుస్తోంది.



# మెరుగైన ఆరోగ్యం యోగాతో సాధ్యం

**జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్**

**అనంతపురం జిల్లా విద్యుత్ శాఖ ప్రాంగణంలో**

**యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణ**



అనంతపురం(విజయ సారథి):అనంతపురం జిల్లా విద్యుత్ శాఖ ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ మరియు వాణిజ్య పన్నుల శాఖ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ మాట్లాడుతూ మెరుగైన ఆరోగ్యం యోగాతో సాధ్యమని పేర్కొన్నారు. ప్రజలందరి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని యోగ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని, అందరూ కూడా తమ ఆరోగ్యం కోసం యోగ చేసుకొని శారీరక, మానసిక ఆరోగ్యం పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో డియంహెచ్ఓ మరియు యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి డా.ఈబి.దేవి, విద్యుత్ శాఖ డైరెక్టర్ టెక్నికల్ గురవయ్య ,వాణిజ్య పన్నుల స్టేట్ జిఎస్టి జాయింట్ కమిషనర్ శేషాద్రి, డిప్యూటీ కమిషనర్ మురళి మనోహర్ రావు, ఏసిలు నరసింహులు, సోనియా తార, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బియన్ సుబ్బన్న, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఆయుష్ అధికారులు డా.రామ్ కుమార్, డా.లాల్యా నాయక్, డెమో త్యాగరాజ్ ,డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, వివేకానంద యోగ కేంద్రము రాజశేఖర్ రెడ్డి, మారుతి ప్రసాద్, నవోమి, తదితరులు పాల్గొని యోగాసనాలు చేశారు.ఈ సందర్భంగా డియంహెచ్ఓ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది అందరూ యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం సంతోషకరమన్నారు. సమాజంలో వున్న ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా యోగా కార్యక్రమాన్ని ఒక నెల రోజులు పాటు నిర్వహించి ప్రజలందరికి నిత్య జీవితంలో యోగ ఒక భాగం చేయాలన్నారు. అందరూ యోగాను సాధన చేయాలని, యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల దేశ ప్రధాని నరేంద్ర మోడీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, జిల్లాలో యోగా కార్యక్రమము విజయవంతంగా జరగడానికి మార్గదర్శం చేస్తున్న జిల్లా కలెక్టర్ డా.వినోద్ కుమార్ వి.ఐఏఎస్, ఈ రోజు యోగ జరగడానికి సహకరించిన విద్యుత్ శాఖ అధికారికి, వాణిజ్య పన్నుల శాఖ అధికారికి ధన్యవాదాలు తెలిపారు.

# ఆస్పత్రులలో సేవలు మరింత మెరుగుపరచాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్.**

అనంతపురం(విజయ సారథి):ఆస్పత్రులలో సేవలు మరింత మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, సిహెచ్సిలు, ఏరియా ఆసుపత్రులు, ప్రైవేట్ నెట్వర్క్ ఆస్పత్రుల డాక్టర్లు, వైద్య మిత్రులు, తదితరులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మీరు ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి డిస్చార్జ్ అయ్యేవరకు వైద్యమిత్ర సహాయ సహకారాలు మీకు సంతృప్తికరంగా ఉన్నాయా, మీరు ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి డిస్చార్జ్ అయ్యేవరకు ఎవరైనా మీ వద్ద నుండి డబ్బులు అడిగారా?, మీకు డా.ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఆస్పత్రి నందు చేరేటప్పుడు అడ్మిషన్ సాఫీగా జరిగిందా, లేదా, ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి డిస్చార్జ్ అయ్యేవరకు ఆసుపత్రి వారి సేవలు మీరు సంతృప్తి చెందారా అనే అంశాల గురించి ప్రభుత్వం ద్వారా వచ్చిన ఫీడ్బ్యాక్ పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, సిహెచ్సిలు, ఏరియా ఆసుపత్రులు, ప్రైవేట్ నెట్వర్క్ ఆసుపత్రులలో అందిస్తున్న సేవలు మరింత మెరుగుపరచాలన్నారు. ఆయా ఆసుపత్రులలో అందిస్తున్న సేవలలో ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు వచ్చినా కఠిన చర్యలు తీసుకునేందుకు వెనకాడమన్నారు. జిల్లాలోని ఆసుపత్రులలో ఉదయం ఒక ఆసుపత్రిని, మధ్యాహ్నము ఒక ఆసుపత్రిని పని దినాలలో రోజు రెండు ఆసుపత్రులను తనిఖీ చేయాలని డా.ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ ని, డిసిహెచ్ఎస్ లను ఆదేశించారు. ప్రైవేట్ హాస్పిటల్స్ నుంచి పలు రకాల రిపోర్ట్స్ వస్తున్నాయని, వాటిల్లో సేవలందించడంలో మరింత ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేసి డాక్టర్లకు ఈ విషయం తెలియజేయాలని, దీని ద్వారా ప్రజలకు మంచి సేవలు అందించేందుకు వీలవుతుందన్నారు. మళ్లీ నెల రోజుల తర్వాత రిపోర్ట్ రావడం జరుగుతుందని, ఆ సమయానికి పరిస్థితిలో మార్పు రావాలన్నారు. పరిస్థితిలో మార్పు రాకపోతే చర్యలు తీసుకుంటామన్నారు.ఈ సమావేశంలో డా.ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా.కిరణ్ కుమార్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డా.పాల్ రవికుమార్, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, డా.ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా క్రమశిక్షణ కమిటీ మెంబర్ డా.లక్ష్మణ్ ప్రసాద్, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, సిహెచ్సిలు, ఏరియా ఆసుపత్రులు, ప్రైవేట్ నెట్వర్క్ ఆస్పత్రుల డాక్టర్లు, వైద్య మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.




# బయలు వీరభద్రస్వామికి ప్రదోషకాల అభిషేకం

శ్రీశైలం(విజయ సారథి):లోకకల్యాణం కోసం దేవస్థానం మంగళవారం సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి విశేషపూజలను జరిపించనున్నది.ప్రతీ మంగళవారం మరియు అమావాస్యరోజులలో బయలువీరభద్రస్వామివారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహించబడుతున్నాయి.బయలువీరభద్రస్వామివారు శివభక్తగణాలకు అధిపతి. అదేవిధంగా శ్రీశైలక్షేత్రపాలకుడుగా క్షేత్రానికి ఆరుబయట ఉండి, ఎటువంటి ఆచ్ఛాదన, ఆలయం లేకుండగా బయలుగా దర్శనమిస్తాడు కనుక ఆయనకు బయలువీరభద్రస్వామి అని పేరు వచ్చింది. ప్రసన్నవదనంతో కిరీట మకుటాన్ని కలిగి దశభుజుడైన స్వామివారు పది చేతులలో వివిధ ఆయుధాలతో దర్శనమిస్తాడు. స్వామివారికి క్రిందివైపున కుడివైపు దక్షుడు, ఎడమవైపు భద్రకాళి దర్శనమిస్తారు. ఈ స్వామిని దర్శించినంత మాత్రానే ఎంతటి క్లిష్ట సమస్యలైనా తొలగిపోతాయని, వ్యాధులు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని ప్రసిద్ధి.ముఖ్యంగా ఆగమసంప్రదాయంలో క్షేత్రపాలక పూజకు చాలా విశేషస్థానం ఉంది. క్షేత్ర పాలకుడికి పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయం, బాధలు లేకుండా సుఖసంతోషాలతో ఉంటారు. మంగళవారం, ఆదివారం మరియు అమావాస్య రోజులలో చేసే వీరభద్రపూజ అనేక ఫలితాలు ఇస్తుందని ఆగమశాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్వామిపూజతో సకలగ్రహ అరిష్టదోషాలు, దుష్టగ్రహపీడలు తొలగిపోతాయి. అదేవిధంగా సంతానం, ఐశ్వర్యం మొదలైన అనేక శుభఫలితాలు చేకూరుతాయి.ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.

# నందీశ్వరస్వామికి విశేషపూజ

శ్రీశైలం(విజయ సారథి):లోక కల్యాణం కోసం దేవస్థానం మంగళవారం ఆలయప్రాంగణంలోని నందీశ్వర స్వామికి (శనగల బసవన్న స్వామివారికి) విశేషార్చనలను నిర్వహించనున్నది.ప్రతి మంగళవారం మరియు త్రయోదశి రోజున దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ప్రదోషకాలంలో అనగా సాయంసంధ్యాసమయంలో ఈ విశేషపూజలు నిర్వహించడం జరుగుతోంది.ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతుంది.అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకుమహాగణపతిపూజను జరిపించబడుతుంది.ఆ తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది.వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది.చివరగా స్వామికి నివేదన సమర్పించబడుతుంది.

# ఈ నెల 21న జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయండి..!

**ప్రతి కుటుంబం యోగాతో ఆరోగ్య భాగ్యాన్ని పొందండి**

**గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు కార్యక్రమ నిర్వహణకు కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలి**

**ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలలో ప్రతి ఒక్కరూ యోగాంధ్ర లో భాగస్వామ్యం కావాలి**

**జిల్లా లో 5,750 మంది శిక్షకుల ద్వారా 5.60 లక్షల మందికి శిక్షణ**

**ఇప్పటి వరకు జిల్లా లో 9 లక్షల పైగా యోగాంధ్ర యాప్ లో పేర్ల నమోదు**

**ఈ నెల 20న అన్నిచోట్లా మాక్ డ్రిల్ నిర్వహించాలి**

**జిల్లా కలెక్టర్**

కడప(విజయ సారథి):రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 21న జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి తగు కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా సచివాలయంలోని సభా భవన్ లో 11 వ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా ఈ నెల 21 న గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు నిర్వహించే కార్యక్రమాల నిర్వహణపై జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ను పురస్కరించు కొని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మే 21 నుండి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర మాసోత్సవాలను నిర్వహిస్తోందనన్నారు. ప్రతి పౌరుని ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగ విశిష్టతను ప్రజలకు చాటి చెప్పేందుకు ఈ కార్యక్రమాలను అత్యంత ప్రాధాన్యత గా తీసుకొని నిర్వహించడం జరుగు తోందనన్నారు.జిల్లా లో యోగా మాసోత్సవాల్లో భాగంగా ఇది వరకే అనేక కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని, పర్యాటక కేంద్రాలైన ఒంటిమిట్ట,సిద్ధవటం శిల్పారామం లలో కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ నెల 18న గండి కోట పర్యాటక ప్రాంతంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో దాదాపు 5 వేల నుండి 6 వేల మందితో యోగా నిర్వహించడం జరుగు తోందన్నారు.జిల్లా వ్యాప్తంగా 5,750 మంది యోగా శిక్షకుల ద్వారా ఇప్పటివరకు 5 లక్షల 60 వేల మందికి యోగ పై శిక్షణ మరియు అవగాహన కల్పించడం జరిగిందనన్నారు. జిల్లాలో ఇప్పటివరకు అన్ని వర్గాల ప్రజల నుండి యోగ పై ఆసక్తి ఉన్నవారు దాదాపు తొమ్మిది లక్షల మంది వరకు వారి వారి పేర్లను యోగాంధ్ర యాప్ లో నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రపంచ యోగా దినోత్సవంలో భాగంగా జూన్ 21వ తేదీన.. విశాఖపట్నంలో జరిగే యోగా కార్యక్రమంలో దేశ ప్రధాని నరేంద్రమోడీ, మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారు పాల్గొననున్నారన్నారు. జిల్లా లో ఈనెల 21న గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు జరిగే యోగాంధ్ర కార్యక్రమాలను ఉదయం ఏడు గంటలకల్లా కచ్చితంగా ప్రారంభించి 8 గంటలలోపు పూర్తి చేయాలన్నారు. ఇందులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు యోగ విశిష్టతను వివరించే యోగా గురువులచే పలు రకాల ప్రసంగాలు తదితర కార్యక్రమాలను ఉదయం 8 గంటల లోపే పూర్తి చేయాలన్నారు. ప్రతి పౌరుడు వారి ఆరోగ్య సంరక్షణకు వారి కుటుంబంతో సహా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యేలా గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం తో పాటు స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ట్రేడ్ అసోసియేషన్లు భాగస్వామ్యంఅయ్యేలా ప్రతి ఒక్కరిని ప్రోత్సహించాలన్నారుజిల్లా కేంద్రం కడప నగరానికి సంబంధించి.. ప్రధాన వేదికగా వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో నిర్వహించడం జరుగుతోందన్నారు. అంతే కాకుండా నగరంలోని మున్సిపల్ మైదానం, ఆర్ట్స్ కళాశాల మైదానం, మరికొన్ని ప్రధాన రహదారుల్లో నిర్వహించాలని, అలాగే అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో, ప్రధాన పట్టణాల్లోని ప్రధాన ప్రాంతాల్లో యోగా కార్య క్రమాలు నిర్వహించాలన్నారు. పోలీసు వారు ప్రధాన కూడలి లలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు.ఈ యోగా మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించే యోగా కార్యక్రమాల్లో కార్యక్రమాల్లో అన్ని మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రత్యేకించి వైద్యశాఖ నుండి వైద్యుల నుండి ఏఎన్ఎంల వరకు అలాగే ఐసిడిఎస్, డిఆర్డీఏ, మెప్మా, శాఖల వారీగా వారి పరిధిలో ఉన్న వారితో యోగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులతో పాటు వారి సిబ్బంది కూడా యోగ కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగా కార్యక్రమంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచే దిశగా మీడియా విస్తృత ప్రచారం ప్రచారం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విశ్వేశ్వర్ నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తహసీల్దార్లు, ఎంపీడీఓ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ సిందూర్‌తో టెర్రరిస్టుల అణచివేత

**పాక్ దుర్నీతిని ప్రపంచదేశాలకు వివరించాం**

**భారత్ చర్యలను సమర్థించిన పలు దేశాలు**

**దౌత్యపరమైన విజయం సాధించామన్న ఎంపి మాధుర్**

అంబేద్కర్ కోనసీమ,జూన్ 17 ఆపరేషన్ సిందూర్‌ని ప్రారంభించి టెర్రరిజం అణచివేతకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ నేతృత్వంలో గయానా, పనామా, కొలంబియా, బ్రెజిల్, యునైటెడ్ దేశాలను సందర్శించారు. ఈ బృందంలో ఎంపీ హరీష్ బాలయోగి కూడా ఉన్నారు. ఢిల్లీకి తిరిగి వచ్చిన తర్వాత మీడియాతో ఆయన మాట్లాడారు. ఐదు దేశాలతో దౌత్యపరమైన చర్చలు జరిపినట్లు వెల్లడించారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఐదు దేశాలు ఇండియాకు మద్దతిచ్చాయని అన్నారు. ఈ సందర్భంగా ఆ దేశాల ప్రతినిధులకు ఎంపీ గంటి హరీష్ మాధుర్ ధన్యవాదాలు తెలిపారు. మే 24వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు వివిధ దేశాల్లో తాము పర్యటించామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ వెల్లడించారు. యునైటెడ్ నేషన్స్ పర్యటన అనంతరం ఇండియాకు చేరుకున్నామని తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడదామని ఆయా దేశాలకు తాము వివరించామని అన్నారు. పాకిస్థాన్ మిలటరీ బేస్ క్యాంప్‌నకు ఇబ్బంది లేకుండా టెర్రరిస్టులను మాత్రమే లక్ష్యంగా చేసుకుని భారత బలగాలు దాడులు చేశాయని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నేతలతో కలిసి ఈ పర్యటన చేశామని చెప్పారు. న్యూయార్క్ 9/11 టెర్రరిస్ట్ దాడులను జ్ఞాపకం చేసుకుని, టెర్రరిజాన్ని అంతం చేయాలనే విషయాన్ని ఆయా దేశాల ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశామని అన్నారు. తాము పర్యటించిన ప్రతి దేశంలో భారతదేశానికి మద్దతు లభించిందని ఎంపీ గంటి హరీష్ మాధుర్ గుర్తుచేశారు.౹÷్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఐదు దేశాల ప్రతినిధులకు భారతదేశం అండగా ఉంటుందని చెప్పామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. యుద్ధం పరిష్కారం కాదు కానీ టెర్రరిజం అంతం చేసే ప్రణాళికలకు అందరూ సహకరిస్తున్నారని అన్నారు. భార్య బిడ్డల ముందు పహల్గామ్‌లో భారత పర్యాటకులను పాకిస్థాన్ ఉగ్రవాదులు చంపడం నీచమైన చర్య అని... దీనినే ప్రపంచ దేశాలకు తెలియజేశామని చెప్పారు. ఇండియాతో కలసి రావటానికి ప్రపంచ దేశాలు మొగ్గ చూపాయని పేర్కొన్నారు. పాకిస్థాన్ చేస్తున్న తప్పుడు ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొట్టామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. పాకిస్థాన్ చేస్తున్న కుట్రలను ప్రపంచ దేశాలకు తెలియజేశామని... వాస్తవాలను అందరూ గ్రహించారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో సామాన్యులకు, పౌరులకు ఎలాంటి హాని జరగలేదని గుర్తుచేశారు. పక్క ప్రణాళికతో ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేశామని పేర్కొన్నారు. ఈ అవకాశం తనకు కల్పించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి కృతజ్ఞతలు తెలిపారు.

# ఇరాన్‌తో సంబంధాలు..ఇజ్రాయిల్‌కు మద్దతా

**కేంద్రం తీరుపై మండిపడ్డ బివి రాఘవులు**

విజయవాడ,జూన్ 17:ఇరాన్‌తో మన దేశానికి ఆర్థిక సంబంధాలు ఉన్నాయి.. కానీ, ఇజ్రాయిల్ కి భారత్ మద్దతు ఇస్తోందని, ఇదీ దారుణం అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు.. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన వివిధ అంశాలపై స్పందించారు.. పెహల్గామ్ లో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును ప్రజలకు వివరించడానికి వారం రోజులు ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నాం.. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదుల స్థావరాలపై దాడిచేసి ధ్వసం చేసింది.. మరి, పాకిస్థాన్, ఇండియా మధ్య యుద్ధం ఆపింది నేనే అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నాడు.. దీంతో, కేంద్రం ఏదో దాస్తుంది అనే అనుమానం కలుగుతుందన్నారు.. ఇజ్రాయిల్, ఇరాక్ మధ్య యుద్దాన్ని కూడా ఆపుతామంటూ ట్రంప్ ప్రకటించారని గుర్తుచేశారు.. ఇక, గతంతో ఇందిరా గాంధీ ఎమ్జ్గ÷న్సీని గుర్తు చేసుకోవాలి.. నాటి పరిస్థితికంటే మరింత దారుణమైన పరిస్థితులు ఇప్పుడు వచ్చాయని విమర్శించారు బీవీ రాఘవులు.. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్న ఆయన.. ఇరాన్.. ఇజ్రాయిల్‌పై దాడి చేసింది.. ఈ యుద్దం తీవ్రమైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దెబ్బతగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.. యుద్ధం నుండి వెనక్కి తగ్గాలని ఇజ్రాయిల్ పై ఒత్తిడి తీసుకుని రావాలని సూచించారు.. ఇజ్రాయిల్ కి భారత్ మద్దతు ఇస్తోంది.. ఇదీ దారుణం అన్నారు.. ఇరాన్ తో మన దేశానికి ఆర్థిక సంబంధాలు ఉన్నాయనే విషయాన్ని గుర్తుచేశారు.. ఇజ్రాయిల్ దాడిని భారత్ ఖండించాలి.. ఇప్పటికే 10శాతం క్రూడాయిల్ ధరలు పెరిగాయి.. భారత్ ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. అయితే, అమెరికా చెప్పిన విధంగా ప్రధాని మోడీ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.. పార్లమెంట్ సమావేశాలు వేసి ఈ అంశాలపై చర్చించాలి.. పార్లమెంట్ ముందు ప్రకటన చేయడం అంటే అది ప్రభుత్వ ప్రకటనగా భావిస్తాం.. పార్లమెంట్ మీద ఇంకా నమ్మకం పోలేదన్నారు.

# ఇద్దరు రైతుల ఆత్మహత్య

**పరామర్శించిన మాజీమంత్రి విడుదల రజనీ**

గుంటూరు,జూన్ 17: పల్నాడు జిల్లా నాదెండ్ల మండలంలో ఒకే రోజు ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.. తూబాడులో రైతు గోపాలరావు, నాదెండ్లలో రైతు ఆదినారాయణ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి విడదల రజిని.. పొగాకు మిర్చి సాగుతో నష్టాలతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు.. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలు పట్టించుకోవడం లేదన్ని÷ర్ అయ్యారు.. మిర్చి రైతుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్.. గుంటూరు మిర్చియార్డుకు వెళ్లారు.

# జర్నలిస్టుపై దాడులు కరెక్ట్ కాదు...రాష్ట్ర మంత్రి ఆగ్రహం.

కేసు ఎందుకు కట్టలేదని రెండో పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేసిన..మంత్రి అచ్చెన్న

నీళ్లనమ్ములుతూ..తెల్లమొహం వేసిన.. సీఐ ఈశ్వరరావు. రాజకీయ ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా...?

లేవని సమాధానం చెప్పిన సర్కిల్ ఇన్స్పెక్టర్.మరి కేసు ఎందుకు కట్టలేదు..

నీకు వచ్చిన నష్టం ఏమిటని అడిగిన..రాష్ట్ర మంత్రి అచ్చన్న

ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ యూనియన్ సిఐ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడని మంత్రి దృష్టికి తీసుకువెళ్లిన నాయకులు




శ్రీకాకుళం(విజయ సారథి): నగరంలో సాయంకాల దినపత్రిక సీమాంధ్ర విజన్ ఎడిటర్ ఇంటి పై దాడి జరిగిన విషయాన్ని రాష్ట్ర మంత్రివర్యులు అచ్చం నాయుడు అడిగి తెలుసుకొని రెండవ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ని పిలిచి మందలించి విద్యుత్ శాఖ ఏడి పై కేసు ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు దీనిపై రెండవ పట్టణ సిఐ నీళ్లు నమ్ములుతూ సమాధానం చెప్పలేక తెల్ల మొహం వేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టులు వృత్తిపరంగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని నిత్యం పోరాటపతిమతో వార్తా కథనాలు రాస్తారు. అటువంటి వ్యక్తులపై వ్యక్తిగతంగా కొంతమంది కక్ష తీర్చుకోవడానికి అనేక ఆరోపణలు చేస్తారు.కాబట్టి జర్నలిస్టులకు ప్రభుత్వ పరంగా మనం భరోసా కల్పించాలి తప్ప వారిపై దాడులకు తెగబడ్డ వారిపై రక్షించే పనులు ఉండకూడదని రెండో పట్టణ సీఐ కి మంత్రి సూచనలు సూచించారు. తక్షణమే ఇరువర్గాలని పిలిపించి నిజానిజాలు తెలుసుకొని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐ కి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లాలో గత ప్రభుత్వం ఎన్నో తప్పుడు కేసులు జర్నలిస్టులపై పెట్టారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చి జర్నలిస్టులకు చక్కటి గుర్తింపునిచ్చి జర్నలిస్టులను గౌరవిస్తుందని ఇటువంటి తరుణంలో కొంతమంది అవినీతి అధికారులు వారిపై రాస్తున్న కథనాలకు వ్యక్తిగతంగా కక్షగా తీర్చుకుంటున్నారని అంతేకాకుండా వీలైతే లంచాలిచ్చి.జర్నలిస్టులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని. రాష్ట్ర మంత్రివర్యుల దృష్టికి ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు.. డోల శంకర్ రావు, డా,తిత్తి ప్రవీణ్ కుమార్, రాష్ట్ర బాధ్యులు డోల అప్పన్న, పేడాడ హేమసుందర్, ఆకుల మాధవ్, అద్దంకి సురేష్, బొడ్డేపల్లి రాజేష్, టంకాల గోవింద్ తదితరులు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చంనాయుడుకు జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు గురించి వివరించారు.వాటికి స్పందిస్తూ జర్నలిస్టులపై దాడులు జరిగితే వెంటనే స్పందించాలంటూ దీనిపై జిల్లా ఎస్పీ, డీఎస్పీలతో సంప్రదిస్తానని తెలిపారు.

## 5 సం. లు,15 సం.లు వయసు దాటిన విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ తప్పనిసరి

5 సం.లు 15సం.ల వయసు వారు ఉచితంగా అప్డేట్ చేసుకోవచ్చు

:జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా

నంద్యాల(విజయ సారథి):ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ కు సంబంధించి 5 సం.లు, 15 సం.లు దాటిన పిల్లలు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డిఎల్ఎంసి (జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో డిఎల్డిఓ శివారెడ్డి, జివిస్డబ్ల్యూఎస్ సమన్వయకర్త ఖాదర్, ఆధార్ రీజినల్ కార్యాలయ సిబ్బంది దామోదర్, ఎల్డిఎం రవీంద్ర కుమార్, డిఈఓ జనార్ధన్ రెడ్డి, ఐసిడిఎస్ పిడి లీలావతి, డిఎంహెచ్ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఆధార్ ఉన్న చిన్నారులు తప్పనిసరిగా రెండు సార్లు (5సం.ల నుండి 7సం.లు, 15సం.లు నుండి 17 సం.లు మధ్యలో) ఉన్న వారు తప్పనిసరిగా ఆధార్ అప్డేట్ చేయాలన్నారు. 5 సం.లు, 15 సం.లు దాటిన చిన్నారులు ప్రతి ఒక్కరూ ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ తప్పనిసరి చేసుకోవాలన్నారు. అందుకు 5సం.లు, 15సం.ల వయస్సు వారు ఉచితంగా బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు పోటీ పరీక్షలు వ్రాసే అవకాశం వున్న నేపథ్యంలో తప్పనిసరిగా ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలని డిఈఓను కలెక్టర్ ఆదేశించారు. 7 సం. లు, 17 సం. లు దాటిన చిన్నారులు/విద్యార్థులు వంద రూపాయల రుసుం చెల్లించి ఆధార్ అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఆధార్ సెంటరు ఏర్పాటు చేయడానికి గాను అవసరమైన శిక్షణను ఎస్వీఆర్ ఇంజనీరింగ్ లో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పోస్టల్ అధికారులను ఆదేశించారు. అప్పుడే పుట్టిన నవజాత శిశువులు ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయిన వెంటనే తాత్కాలిక జనన ధృవీకరణ పత్రం అందజేసేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఓను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో చంటి పిల్లలు (0-5సం.లకు) సంబంధించిన వివరాల్లో వ్యత్యాసాలు లేకుండా చూడాలని సంబధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆధార్ కేంద్రాల నిర్వహణ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఎల్డిఎంను కలెక్టర్ ఆదేశించారు.




# ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల నియంత్రణ పాటించాలి: అనంతరత్నం మాదిగ



కర్నూలు(విజయ సారథి): ప్రైవేట్ విద్యా సంస్థలలో ఫీజుల నియంత్రణ పాటించాలని మంగళవారం డిఈఓ ఎస్ సామ్యూల్ పాల్ ని కోడుమూరు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ అనంతరత్నమ్ మాదిగ ఐఎన్ యుసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎం ఖాద్రి పాషా , కాంగ్రెస్ నాయకులు జె నాగరాజు, జె కుమార్ కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా కోడుమూరు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అనంతరత్నం మాదిగ మాట్లాడుతూ ఈనాటి తెలుగుదేశం ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తల్లికి వందనం స్కీం ద్వారా కుటుంబంలో ఎంతమంది చదువుకుంటే అంతమందికి విద్యార్థి విద్యార్థినీల తల్లుల అకౌంట్లో చదువుకోడానికి నగదును కేటాయించడం జరిగింది ఇది అదునుగా చూసుకుని ప్రైవేటు స్కూల్ యజమాన్యం వారు అక్రమంగా అధిక ఫీజులు పెంచడం జరిగింది కొంతమంది విద్యార్థిని తల్లిదండ్రులు ఎందుకు ఈ విధంగా అమాంతంగా ఫీజులు పెంచారని అడగగా మీకు ఉచితంగా ప్రభుత్వము నుండి తల్లికి వందనం స్కీం ద్వారా నగదు వస్తుంది కనుక వేము ఫీజులు పెంచామని కొన్ని ప్రైవేటు సంస్థలు చెప్పకనే చెబుతున్నాయి కావున ప్రభుత్వము ప్రభుత్వ ఉన్నత అధికారులు స్పందించి ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యాన్ని పిలిపించి అధిక ఫీజులను అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని మాట్లాడారు లేదంటే విద్యార్థుల తల్లిదండ్రులను ప్రజలను కలుపుకొని కాంగ్రెస్ పార్టీ తరఫున ధర్నాలు చేయడానికి కూడా వెనకాడమని తెలియజేశారు

# శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం

శ్రీశైలం(విజయ సారథి):లోకకల్యాణం కోసం దేవస్థానం మంగళవారం మరియు షష్టిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది.ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి.కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది.ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు.తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి.సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

# సుగాలి మెట్ట ఏపీ మోడల్ స్కూలును ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

పాణ్యం/నంద్యాల(విజయ సారథి):పాణ్యం మండలం సుగాలి మట్ట ఏపీ మోడల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మోడల్ పాఠశాలలోని విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటిస్తూ విద్యాభ్యాసం, పాఠశాలలోని సౌకర్యాలు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. త్రాగునీటి వసతి, అప్రోచ్ రోడ్డు సమస్యగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రయోగశాలలోని అన్ని పరికరాలు ఉన్నాయా లేదా సంబంధిత వివరాలపై ఆరా తీశారు. మోడల్ పాఠశాలతో పాటు చుట్టూ పరిసర ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలకు అవసరమైన త్రాగునీటి వసతి, సీసీ రోడ్డు తదితర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.అనంతరం పదవ తరగతి గదిని పరిశీలిస్తూ విద్యార్థులతో ముచ్చటిస్తూ ఉపాధ్యాయురాలిగా మారి ఇంగ్లీష్ క్లాస్ తీసుకొని పాఠ్యాంశాలపై ఎలా ఆలోచించాలి, భవిష్యత్తులో పోటీ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి తదితర అంశాలపై విద్యార్థులకు ఉద్బోధించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తూ ఆహార పదార్థాలను పిల్లలకు తినిపించారు. వంటశాల, స్టోర్ రూంలో నిల్వ ఉన్న సరుకులు, సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహార పదార్థాలను అందించాలని సూచించారు. ఏపీ మోడల్ స్కూల్ ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రిన్సిపాల్ ను, ఎంఈఓ ను కలెక్టర్ ఆదేశించారు.

మోడల్ స్కూలులో ఉపాధ్యాయురాలిగా మారి విద్యార్థులకు ఉద్బోధించిన కలెక్టర్

పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూరుస్తాం

జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



# కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధి కి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నాం

క్రీడల అభివృద్ధికి స్టేడియం ల ఏర్పాటు.

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి వర్యులు టీజీ భరత్

కర్నూలు(విజయ సారథి):కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధి కి అన్ని విధాలుగా చర్యలుతీసుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి వర్యులు టీజీ భరత్ పేర్కొన్నారు.మంగళవారం ఉదయం కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామం జగన్నాథ గట్టు వద్ద ఉన్న టిడ్కో గృహాలకు ఎదురుగా ఆరు ఎకరాల్లో గ్రీన్ కో కంపెనీ సిఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం, క్రీడా కాంప్లెక్స్ కు మంత్రి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ల, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ.శ్యామ్ బాబు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ హైవే దగ్గర్లో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయమన్నారు.ఈ స్టేడియం ఏర్పాటు కర్నూలు జిల్లాలో అభివృద్ధికి చిహ్నంగా నిలుస్తుందన్నారు.అదే విధంగా కోడుమూరు నియోజకవర్గంలో బాల సాయిబాబా స్కూల్ పక్కన ఉన్న ఏసీఏ క్రికెట్ గ్రౌండ్ లో కూడాస్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్రీడల వల్ల జీవితంలో కూడా చాలా క్రమశిక్షణ కలిగి ఉంటారని మంత్రి తెలిపారు. గ్రీన్ కో కంపెనీ పి 4 విధానం ద్వారా ముందుకు వచ్చి సి ఎస్ ఆర్ కింద స్టేడియం నిర్మించడం అభినందించాల్సిన విషయమన్నారు.అదే విధంగా ప్రపంచంలోనే అతి పెద్దదైన పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ కర్నూలు జిల్లాలో ఏర్పాటు కావడం సంతోషంగా ఉందన్నారు.జిల్లాలో మరిన్ని మంచి పరిశ్రమలు తీసుకొని వచ్చి ఉపాధి అవకాశాలు కూడా కల్పించే విధంగా కృషి చేస్తున్నామన్నారు.5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.ప్రతి నియోజకవర్గంలో ఎమ్ఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి అవకాశాల కల్పనకు ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు.పత్తికొండ లో ఏర్పాటు చేయనున్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ను కూడా త్వరలోనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలు అయిన తిరుపతి, అనంతపురం, కడప లలో మంచి స్టేడియం లు ఉన్నాయన్నారు.అదే విధంగా కర్నూలులో నిర్దిష్ట మరియు కేంద్రీకృత స్టేడియం ఒకటి ఉండాలనే ఉద్దేశ్యంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోడుమూరు నియోజకవర్గంలో బాల సాయిబాబా స్కూల్ పక్కన ఉన్న ఏసీఏ క్రికెట్ గ్రౌండ్ లో రెండు స్టేడియం లను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారని కలెక్టర్ తెలిపారు.ప్రతి నియోజకవర్గంలో ఒక స్టేడియం ఉంటే క్రీడాకారులకు ఎంతగానో లబ్ది చేకూరుతుందన్నారు. లక్ష్మీపురం గ్రామం జగన్నాథ గట్టు వద్ద ఉన్న టిడ్కో గృహాలకు ఎదురుగా క్రికెట్ స్టేడియం ను అభివృద్ధి చేయడమే కాకుండా క్రికెట్ తో పాటు బాస్కెట్ బాల్, కబడ్డీ, ఇండోర్ స్టేడియం షటిల్, స్విమ్మింగ్ తదితర అన్ని రకాల సదుపాయాలతో అత్యుత్తమ కేంద్రంగా తీర్చిదిద్దుతామని గ్రీన్ కో కంపెనీ ముందుకు రావడం జరిగిందన్నారు.ఇక్కడ పిల్లల ప్రతిభను గుర్తించి వారికి ఆహారం, వసతి సౌకర్యాలతో పాటు 15 సంవత్సరాల వరకు 40 మంది ప్రత్యేకమైన కోచ్ లతో ప్రత్యేక శిక్షణ ఇచ్చి క్రీడాకారులను బయటకు తీసుకొని రావాలనే ఉద్దేశ్యంతో ఈ స్టేడియం ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి పాణ్యం నియోజకవర్గంలో పర్యటన కు వచ్చిన సమయంలో పి4 విధానం లో గ్రీన్ కో కంపెనీ వివిధ రంగాల అభివృద్ధికి రూ.10 కోట్లను ప్రకటించడం జరిగిందన్నారు.ఇప్పుడు రూ.4 కోట్లతో స్టేడియం ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఆరు నెలల సమయంలో స్టేడియం పూర్తి చేసే విధంగా గ్రీన్ కో కంపెనీ యాజమాన్యం చర్యలు తీసుకుంటున్నారన్నారు. స్టేడియం ఏర్పాటుకు 6 ఎకరాల భూమిని మున్సిపల్ కార్పొరేషన్ స్వాధీనం చేయడం జరుగుతుందన్నారు.ఇక్కడ ఏర్పాటు చేయనున్న స్టేడియం ను క్రీడాకారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ కర్నూలు కి క్రికెట్ స్టేడియం రావడం చాలా సంతోషించాల్సిన విషయం అన్నారు.కర్నూలు జిల్లా నుండి ఎంతోమంది క్రీడాకారులు బాగా రాణిస్తున్నారన్నారు.గ్రీన్ కో వారి సహకారంతో లక్ష్మీపురం జగన్నాథ గట్టు వద్ద 6 ఎకరాలలో స్టేడియం, క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి, క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి భోజన, వసతి సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు.గ్రీన్ కో కంపెనీ యాజమాన్యం సిఎస్ఆర్ నిధుల కింద గ్రామాల్లో అభివృద్ధి పనులను చేస్తున్నారన్నారు.చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు.క్రీడల్లో బాగా రాణించినట్లయితే జీవితంలో స్థిరపడతారన్నారు. విద్యార్థులందరూ తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని జీవితంలో ముందుకు వెళ్ళాలని ఎమ్మెల్యే కోరారు.పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ.శ్యామ్ బాబు మాట్లాడుతూ కర్నూలులో గ్రీన్ కో ఈ ప్రాజెక్ట్ చేయడం చాలా అభినందించాల్సిన విషయమన్నారు.ఈ ప్రాజెక్ట్ ద్వారా కర్నూలు జిల్లాకు మరింత అందం చేకూరుతుందన్నారు. మండల స్థాయిలో చాలా మంది క్రీడాకారులు ఉన్నారని, వారు అవకాశాల కొరకు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం వెళ్ళేవారన్నారు.ప్రతి ఒక క్రీడాకారునికి న్యాయం జరిగే విధంగా గ్రీన్ కో వారి ద్వారా జిల్లా కలెక్టర్ కర్నూలు లో స్టేడియం ఏర్పాటు చేయించడం గర్వించదగ్గ విషయమన్నారు.రాబోయే కాలంలో ఇలాంటి స్టేడియం లు మరిన్ని రావాలని, ఉమ్మడి జిల్లాలో ఉన్న విద్యార్థులు, క్రీడాకారులకు మరిన్ని మంచి అవకాశాలు రావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పం పి4 మోడల్ సంకల్పానికి ఇది ఒక ఉదాహరణ అన్నారు.అధిక నెట్వర్క్ ఉన్న వ్యక్తులు ఎవరైతే ఉన్నారో వారు అందరూ సమాజానికి మంచి జరిగే విధంగా ఉండడమే పి4 మోడల్ అన్నారు.గ్రీన్ కో కంపెనీ లో ఏదైతే గ్రీన్ ఉందో అదే విధంగా ఇక్కడ ఏర్పాటు చేయనున్న స్టేడియం ను కూడా గ్రీన్ స్టేడియం గా అద్భుతంగా ఏర్పాటు చేయనున్నారన్నారు.కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ క్రీడల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. కర్నూలులో స్టేడియం ఏర్పాటు వల్ల ఎంతో మంది క్రీడాకారులు తయారవుతారన్నారు.. క్రీడల వల్ల విద్యార్థులకు మంచి భవిష్యత్ లభించే అవకాశం ఉందని, ఇలాంటి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య లక్ష్యం అన్నారు. పరిశ్రమలు ఎన్నో తీసుకొని వచ్చేందుకు మంత్రి కృషి చేస్తున్నారన్నారు.అభివృద్ధి పనులకు కుడా తగిన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు..కార్యక్రమంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, గ్రీన్ కో కంపెనీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, గ్రీన్ కోఅసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com